ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 4 డిసెంబరు 2024 | 5



మద్యం షాపులు బంద్

అమలాపురం టౌన్/యానాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో మద్యం షాపులు, బార్లు మూసి వేయాలని జిల్లా ఎన్నికల అధికారి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి గురువారం సాయంత్రం 4 గంటల వరకు మద్యం డిపోలు, దుకాణాలు, బార్‌లు మూసి ఉంచాలన్నారు. రెండు రోజుల పాటు యానాంలో మద్యం షాపులు మూసివేయనున్నట్టు పుదుచ్చేరి డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ తెలిపారు.

రేపు టీచర్స్ ఎమ్మెల్సీ పోరు

- ఉదయం 8 నుంచి పోలింగ్ - 16,737 మంది ఓటర్లు - 9న కౌంటింగ్



బి.గోపిమూర్తి | జి.నారాయణరావు | కె.నాగేశ్వరరావు | పులుగు దీపక్ | ఎన్.వెంకటలక్ష్మి

కలెక్టరేట్ (కాకినాడ)/ రాజమహేంద్రవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ నియోజకవర్గం శాసనమండలి(ఎమ్మెల్సీ) ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది.గత ఎన్నికల్లో యూటీఎఫ్ తరఫున గెలిచిన షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది.ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు.బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరగనున్నాయి.ఐదుగురు అభ్యర్థులు స్వతంత్రంగా బరిలో ఉండడంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి.యూటీఎఫ్ నేత బొర్రా గోపీమూర్తి, గంధం నారాయణరావు,డా.కవల నాగేశ్వరరావు,పులుగు దీపక్, నామన వెంకట లక్ష్మి(విళ్ల లక్ష్మి) పోటీ పడుతున్నారు. ప్రధాన పోటీ ఇద్దరి మధ్యే ఉంటుందని పరిశీలకులు అంచనా. ఇంత వరకూ ప్రచారం హోరాహోరీగా సాగింది. మంగళవారం సాయంత్రం 4 గంటలతో ప్రచారం ముగిసింది. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.16,737 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కాకినాడ జిల్లాలో 3418 మంది,తూర్పుగోదావరి జిల్లాలో 2990, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3296, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 637, పశ్చిమగోదావరిజిల్లాలో 3729, ఏలూరు జిల్లాలో 2667 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను సురక్షితంగా కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించనున్నారు.ఈనెల 9వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తారు. ఈనెల 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఎన్నికల్లో విధులు నిర్వహించేందుకు పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టార్ అధికారులు, ఇతర సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధ, గురువారాలు 144 సెక్షన్ అమల్లోకి తెచ్చారు. తూర్పుగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు డీఆర్వో సీతారామమూర్తి తెలిపారు.

ఎన్నిక ప్రశాంతంగా జరగాలి

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నిక స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో అన్ని మండలాల తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భారత ఎన్నికల సంఘం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఓటు వేసేందుకు క్యాజువల్ లీవ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఈ నియోజకవర్గ ఉపాధ్యాయ ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు యాజమాన్యాలు తగు వెసులుబాటు కల్పిస్తూ విధులకు ఒక గంట ఆలస్యంగా హాజరయ్యేందుకు, షిఫ్టుల అడ్జస్ట్‌మెంటు అనుమతించాలన్నారు.

సంక్రాంతి నాటికి పల్లె పండుగ పనులు పూర్తవ్వాలి

అమలాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పల్లె పండుగ పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను పూర్తి నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. అనంతరం జిల్లాలోని వివిధ మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ నమోదైన 24 గంటలలోపు సంబంధిత జిల్లా అధికారి గ్రీవెన్స్‌ను చూసి వారి శాఖల్లోని అధికారులకు కేటాయించాలన్నారు. నిర్దేశిత గడువులోగా అర్జీని పరిష్కరించకపోతే ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో స్పష్టంగా స్పీకింగ్ ఆర్డరు ఇవ్వాలన్నారు. ప్రతీ అర్జీని మూడు స్థాయిల్లో ఆడిట్ నిర్వహిస్తున్నారన్నారు. రీసర్వే హద్దు రాళ్లపై పేర్లను తొలగించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతుల కోసం పీఏసీఎస్‌ల ద్వారా 800 టార్పాలిన్లు అందిస్తున్నామన్నారు.జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన 190 మరుగుదొడ్లు, 248 తాగునీటి వసతుల కల్పనను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో వి.మదన్మోహనరావు పాల్గొన్నారు.

అసలేమైందో..

విశాఖపట్నంలో అపార్ట్‌మెంట్ పై నుంచి దూకి ప్రేమ జంట ఆత్మహత్య

ఇద్దరిదీ అమలాపురమే..





అమలాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన పిల్లి దుర్గారావు(28), ఎన్.సాయిసుస్మిత(25) విశాఖపట్నంలో ఓ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా సంచలనం కలిగించింది. ఇద్దరిదీ అమలాపురం పట్టణ పరిధే కావడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. అమలాపురం పట్టణంలోని మద్దాలవారిపేట సమీపంలో గల రంగ క్యాంటీన్ నిర్వాహకుడు పిల్లి శ్రీనివాసరావు రెండో కుమారుడు పిల్లి దుర్గారావు.. పట్టణంలోని విద్యుత్‌నగర్‌కు చెందిన ఎన్.పల్లంరాజు కుమార్తె సాయిసుస్మిత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నట్లు తెలిసింది. సుస్మిత బీటెక్ పూర్తిచేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తోంది. దుర్గారావు గత కొంతకాలంగా విశాఖపట్నంలోనే క్యాటరింగ్‌తో పాటు బిర్యానీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. అయితే వర్క్ ఫ్రమ్ హోం ఉండడంతో వారం కిందట సుస్మిత దుర్గారావు వద్దకు వచ్చినట్లు చెబుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున వారు విశాఖ నగరంలోని 69వ వార్డు పరిధిలో వెంకటేశ్వర కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి చనిపోయారు. అసలు వారి మధ్య ఏం జరిగిందనేది ప్రస్తుతం సస్పెన్స్‌గా ఉంది. ఇంటిలో టీవీ రిమోట్ విరిగిపోయి, సామగ్రి చిందరవందరగా ఉండడంతో వారిద్దరి మధ్య తీవ్రమైన గొడవ ఏదైనా జరిగి, క్షణికావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారా? అని అనుమానిస్తున్నారు. గొడవలే ఆత్మహత్యకు కారణమా లేక మరేమైనా కారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది..

ప్రధాన వార్త..మెయిన్‌లో



సాహసం సాగరం

నావికాదళ విన్యాసాలకు కేంద్రంగా కాకినాడ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ సాగరం రక్షణపరంగా తూర్పు నావికా దళానికి అత్యంత కీలకం. గడచిన కొన్నేళ్లుగా కాకినాడ సముద్ర జలాల్లో ఇండియన్ నేవీ పలు రకాల మాక్‌డ్రిల్స్ ఎక్సర్‌సైజ్‌లతో భద్రతను పటిష్టం చేస్తోంది. ఈ మేరకు అమెరికన్ నేవీతో సైతం పలు రకాల ప్రత్యేక ఉమ్మడి విన్యాసాలు చేస్తూ తీరాన్ని, సముద్రజలాల సరిహద్దును కంటికి రెప్పలా కాపాడుతోంది. వాస్తవానికి నావికాదళం అంటే విశాఖలోని తూర్పునావికాదళ స్థావరంగా చెబుతారు.దీని పరిధిలో కాకినాడ సాగరం కూడా ఉండడంతో గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో వ్యూహాత్మక రక్షణ చర్యలు చేపడుతోంది. నేడు భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రతి ఏడాది విన్యాసాలు..

2022 అక్టోబరులో భారత నేవీ ఆఫ్‌షోర్ సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్‌ను ప్రస్థాన్ పేరుతో నిర్వహించింది. నౌకల్లోకి నేవీ విమానాలు ఎగురుకుంటూ వచ్చి భద్రత చర్యలు చేపట్టడం, బాంబులు పసిగట్టడం వంటి వాటిపైనా, నిపుణులను రక్షించి తీసుకువెళ్లడంపై మాక్‌డ్రిల్ నిర్వహించింది.2023 జనవరిలో ఆర్మీ,నేవీ,ఎయిర్‌ఫోర్స్ కలిపి కాకినాడలో యాంపెక్స్-2023 నిర్వహించాయి. తీరంలోను సముద్రంలోపల విదేశీ శక్తులు, ఉగ్రవాదులు చొరబడితే వారిని మట్టుపెట్టడం ఎలా? రక్షణ విషయంలో ఎలా చురుగ్గా వ్యవహరించాలి? వ్యూహాల అమలు..వంటివాటిపై ఎక్సర్‌సైజ్ చేపట్టాయి. 2023 ఏప్రిల్‌లో సముద్రంలో చమురు కార్యకలాపాల వల్ల సాగర జలాలు కాలుష్యం నేపథ్యంలో వాటిని ఎలా సంరక్షించుకోవాలి? సముద్రంలో బోట్లు, షిప్పుల్లో జరిగే అగ్నిప్రమాదాల సమయంలో ఆస్తినష్టం తగ్గించుకుంటూ అందులో ఉన్న వారిని కాపాడుకోవడం ఎలా? అనే దానిపై నేవీ విన్యాసాలు నిర్వహించింది. నౌకల్లోంచి నేవీ సిబ్బంది ప్రమాద ఘటనలో ఇతర నౌకల్లో మంటలను అదుపు చేయడం, అందులోని సిబ్బందిని ప్రత్యేక బాక్సుల్లో ఈదుకుంటూ వెళ్లి రక్షించడం, హెలీకాప్టర్ల నుంచి తాడుతో దిగి వారిని కాపాడడం వంటి వాటిని సాహసోపేతంగా చేసి చూపించింది. అదే ఏడాది అక్టోబరులో చమురుసంస్థలు, కోస్ట్‌గార్డ్,కస్టమ్స్ తో కలిపి రక్షణ చర్యలు చేసి చూపించింది. నేవీకి చెందిన ఐఎన్ ఎస్ కోర,ఐఎన్ఎస్ టిహాయులు మెరైన్ కమాండోలతో కలిపి బాంబు డిస్పోజబుల్ నిపుణులు ప్రమాదాల సమయంలో ఏవిధంగా దేశ తీరజలాలను కాపాడుకోవాలో చేసి చూపించాయి.ఈ ఏడాది సెప్టెంబరులో కాకినాడలో తూర్పు నావికాదళం 47వ ప్రాంతీయ సదస్సు ఇక్కడే నిర్వహించింది. ఏటా అమెరికన్ నేవీతో కలిసి విన్యాసాలు చేస్తూ కాకినాడ తీరం,సముద్ర జలాల సరిహద్దుల్లో గస్తీ పెంచి విశేష సేవలందిస్తోంది.

దేశానికి ఆయువుపట్టు కేజీ బేసిన్

ప్రధానంగా కాకినాడ తీరం నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేజీ బేసిన్ దేశానికి అతిపెద్ద ఆయువు పట్టు. సముద్రం మధ్యలో 50 వేల చదరపు కిలోమీటర్లకుపైగా విస్తరించి ఉన్న బేసిన్‌లో 2003 నుంచి 26 బావుల్లో చమురు,గ్యాస్‌ను ఓఎన్‌జీసీ, రిలయన్స్, కెయిన్ ఎనర్జీ వంటి ప్రఖ్యాత కంపెనీలు తవ్వుతున్నాయి.లక్షల కోట్ల పెట్టుబడులతో వందలాది మంది నిపుణులు,సిబ్బంది పదుల సంఖ్యలో నౌకల్లో ఉంటూ ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.దీని రక్షణ భారత తూర్పు నావికాదళం పర్యవేక్షిస్తోంది. కేజీ బేసిన్‌లో అకస్మాత్తుగా అగ్నిప్రమాదాలు జరిగి నా, విద్రోహశక్తులు కన్నేసినా దీన్ని ఎలా రక్షించుకోవాలి? అనేదానిపై ప్రతి ఏటా ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహిస్తోంది. వచ్చే ఏడాది మార్చిలో అమెరికన్ నేవీతో కలిసి విన్యాసాలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.



- కేజీ బేసిన్‌లో చమురు,గ్యాస్
- లక్షల కోట్లతో నిక్షేపాలకు అన్వేషణ
- కీలకంగా మారిన భద్రత
- ఎప్పటికప్పుడు నేవీ నిఘా
- ప్రతి ఏటా ప్రస్థాన్ పేరిట మాక్‌డ్రిల్
- రక్షణ చర్యలపై అవగాహన
- వచ్చే ఏడాది మార్చిలో విన్యాసాలు
- నేడు భారత నౌకాదళ దినోత్సవం

సిద్ధమైతే.. అద్భుతమే!



కాకినాడలో టీయూ-142ఎం యుద్ధ విమాన మ్యూజియం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందిన కాకినాడ బీచ్‌లో ఏర్పాటు చేసిన యుద్ధ విమాన మ్యూజియం త్వరలో సందర్శకులకు వినోదం, విజ్ఞానం అందించనుంది. దేశ భద్రత,రక్షణ కోసం త్రివిధ దళాలు అందిస్తున్న సేవలు, రక్షణ రంగంలో టీయూ-142 ఎం యుద్ధ విమానం అందించిన సేవలను మ్యూజియం రూపంలో థీమ్‌పార్కు పేరిట కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్‌లో 2020లో రూ.5.89 కోట్ల గుడా నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు.సుమారు రెండెకరాల స్థలంలో టీయూ-142 విమాన మ్యూజియం నిర్మాణం పనుల టెండర్‌ని తెనేజా ఏరో స్పేస్ లిమిటెడ్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ఇంకా యుద్ధ విమానం లోపల ఏసీ, విద్యుద్దీకరణ, లైటింగ్ పనులు పూర్తి కావాల్సి ఉంది. ఆయుధాల నిల్వ, వాటిని ఏవిధంగా ప్రయోగిస్తారు, విమాన టేకాఫ్, ల్యాండింగ్ తదితర వివరాలు, దేశానికి అందించిన సేవలు, డిస్‌ప్లే, వీడియో,ఆడియో తదితర సమాచార వ్యవస్థ, గేమింగ్ జోన్, విజ్ఞానంపై సమాచారం ఏర్పాటు చేయాల్సి ఉంది. మ్యూజియంలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి పరిశీలిస్తే మరింత సమయం పట్టే అవకాశం ఉంది. కానీ ఇవన్నీ పూర్తయితే మ్యూజియం సందర్శకులకు కనువిందు చేయనుంది. ఇది ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురుచూస్తున్నారు.

యుద్ధ విమానం ప్రత్యేకతలివే..

టీయూ-142 యుద్ధ విమానాన్ని రష్యా దేశం నుంచి కొనుగోలు చేశారు. కార్గిల్ యుద్ధంలో ఇది విశేష సేవలు అందించింది. ఒక్కసారి ఫ్యూయల్ నింపుకుని ప్రపంచదేశాలను కేవలం 16 గంటల్లో చుట్టివచ్చే సామర్థ్యం దీని సొంతం. ఇది గంటకు 925 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. విమానం పొడవు, వెడల్పులు 50 మీటర్లు, రెక్కల పొడవు 50 మీటర్లు .దీని బరువు 90 వేల కిలోలు. ప్రపంచంలోనే అతి భారీ, పురాతన యుద్ధ విమానాల్లో ఒకటైన టీయూ-142ఎం ఎయిర్‌క్రాఫ్ట్ భారత నావికాదళం వైమానిక విభాగంలో 28 ఏళ్లపాటు దేశానికి విశేష సేవలు అందించింది. సముద్ర తీర గస్తీ, జలాంతర్గామి నిరోధక సేవలు అందించడంలో ఖ్యాతి గడించిన ఈ యుద్ధ విమానం 2017లో నేవీ నుంచి వైదొలిగి, తమిళనాడులోని అరక్కోణం బేసల్ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ రాజసంలో విశ్రాంతి తీసుకుంటుంది. ఈ విమానాన్ని తమిళనాడు నుంచి కాకినాడ బీచ్‌కు 14 భారీ వాహనాల ద్వారా తెనేజా ఏరో స్పేస్ లిమిడెట్ సంస్థ తీసుకువచ్చింది.



తెగ తవ్వేస్తున్నారు..





డ్రెడ్జింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

- అర్ధరాత్రి డ్రెడ్జర్‌తో ఇసుక తవ్వకాలు
- తెల్లవారేసరికి బోట్స్‌మెన్ ర్యాంపుగా చూపుతున్న వైనం
- పుట్టుకొస్తున్న బోట్స్‌మెన్ ఇసుక ర్యాంపులు
- కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు

పి.గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానం, ర్యాంపుల అనుమతులు, విధివిధానాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. పి.గన్నవరం మండలం లంకల గన్నవరంలో అక్విడెక్టు సమీపంలో డ్రెడ్జర్‌తో తవ్వకాలు జరుపుతూ బరితెగించేశారు. ఇంత జరుగుతున్నప్పటికి కనీసం రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఒక పక్క ఇసుక ర్యాంపుల నిర్వహణకు ఏవిధమైన అనుమతులు లేవని చెప్తూ లోపాయికారంగా ర్యాంపులు నిర్వహణకు సై అంటున్న అధికారుల తీరును పలువురు తప్పు పడుతున్నారు. పి.గన్నవరం అక్విడెక్టు లంకలగన్నవరం వైపు గత రెండు రోజులుగా ఒక సొసైటీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా బోట్స్‌మేన్ ర్యాంపును నిర్వహిస్తున్నారు. అయితే ఈ ర్యాంపులో చీకటిపడగానే డ్రెడ్జర్ ద్వారా ఇసుకను తవ్వి గట్టుపై గుట్టలుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచే బోట్స్‌మేన్ ర్యాంపుగా చూపుతూ రూ.1400కు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అక్విడెక్టుకు అతి సమీపంలో డ్రెడ్జర్ ఏర్పాటు చేయడంపై హెడ్‌వర్క్స్ అధికారులు, సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరించడం శోచనీయం. అయితే ఈ ర్యాంపునకు నియోజకవర్గంలోని ముఖ్య నాయకుడు అనుచరులు అండదండలు పుష్కలంగా ఉన్నాయని అందుకే డ్రెడ్జర్‌తో తవ్వకాలను జరుపుతున్నారని పలువురు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. అంతేకాకుండా కూటమి పార్టీయేతర నాయకులు ర్యాంపును నిర్వహిస్తున్నారని కూటమి నాయకులు నుంచే గుసగుసలు వినిపిస్తున్నాయి.

పుట్టగొడుగుల్లా ఇసుక ర్యాంపులు!

జిల్లాలోని పలు మండలాల్లో అధికారులు గుర్తించిన ఇసుక ర్యాంపులు కాకుండా అనధికార ఇసుక ర్యాంపులు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పలు మండలాల్లో గోదావరి తీర ప్రాంతాలకు ఆంక్షలు ఉండటంతో సంబంధిత అధికారులు ఇసుక ర్యాంపులను అధికారికంగా గుర్తించడం లేదు. దీంతో ఉచిత ఇసుక ర్యాంపులు ముసుగులో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ర్యాంపులు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పి.గన్నవరం మండలంలో పి.గన్నవరం, గంటిపెదపూడి, లంకలగన్నవరం పలు ప్రాంతాలలో, మానేపల్లి గ్రామాలలో బోట్స్‌మేన్, ఓపెన్ ఇసుక ర్యాంపులు నడుస్తున్నాయి. అంతే కాకుండా పి.గన్నవరంలో ఓపెన్ ర్యాంపునకు ఇప్పుడిప్పుడే మార్గం సుగుమం చేసుకుంటున్నారు. అలాగే అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లో గోదావరి నది తీర ప్రాంత గ్రామాల్లో సైతం ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఇంత ఇసుక దందా జరుగుతున్నప్పటికి అధికారులు మౌనం వహించడం విశేషం.

అధికారుల పర్యవేక్షణ ఉండాలి

స్థానిక అవసరాలకు ఇసుక లేక ఇబ్బందులు పడుతున్నామని గృహ నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ర్యాంపులకు అనుమతులిస్తే ర్యాంపులు వద్ద స్థానిక సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతే కాకుండా నాయకుల నిర్వహణలో స్థానిక ప్రజానీకానికి ఉచిత ఇసుక అందే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

కొన్ని మినహా మిగిలిన ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా..

అమలాపురం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి ఈ నెల 5నపోలింగ్ జరగనుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. పోలింగ్ జరగనున్న 22 మండలస్థాయి ప్రభుత్వ కార్యాలయాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రమైన అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు మాత్రమే లోకల్ హాలీడే ప్రకటిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లాలోని సబ్‌ట్రెజరీ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలన్నీ యథావిధిగా నిర్వహించాలని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తాటిపాకలో పట్టపగలే చోరీ

7లో

ఇది శబరి లంక పొగాకు

- ఒక్క చింతూరు డివిజనుకే సొంతం
- పాత తరం ధూమపాన ప్రియులకు కిక్కు
- ఏజెన్సీలో మూడు వేల ఎకరాల్లో సాగు
- మూడు వేలమందికి పైగా ఉపాధి


శబరి లంకల్లో సాగు చేస్తున్న పొగాకు


పాకల్లో ఆరబెట్టిన పొగాకు (ఫైల్)




పొగాకు కోస్తున్న మహిళా కూలీలు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి - చింతూరు)

శబరి లంక పొగాకు.. పాతతరం ధూమపాన ప్రియులు అమితంగా ఇష్టపడే లంక చుట్టల తయారీకి వినియోగించే పంట ఇది. రెండు తెలుగు రాష్ట్రాల మొత్తంలోనూ ఒక్క చింతూరు డివిజనుకే ఈ సాగు సొంతం. గోదావరి, శబరి నదీ పరీవాహకం ఈ సాగుకు అనుకూలం. కాగా గోదావరి లంకల్లో కంటే శబరి లంకల్లో పండించిన పొగాకుకే డిమాండ్ అధికం. దీంతో విక్రయ ధర కూడా ఎక్కువే. దీనికి శబరి జలాలే కారణమని రైతులు చెబుతున్నారు. శబరి నీరు సహజసిద్ధంగా తీయదనం కలిగి ఉంటుంది. ఆ నీటిని సాగుకు వినియోగించడంతో చుట్టలు రుచికరంగా ఉంటాయని ధూమపాన ప్రియులు, వ్యాపారస్తులు చెబుతుంటారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో ఈ సాగు అధికం. స్థానిక రైతులే కాకుండా రాజమండ్రి పరిసర ప్రాంత కౌలు రైతులు కూడా ఇక్కడికొచ్చి సాగుచేస్తున్నారు. ఒక్క ఎకరా లంక కౌలు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పలుకుతుంది. అక్టోబరులో సాగు మొదలై ఫిబ్రవరి నెలాఖరుకల్లా విక్రయ లావాదేవీలన్నీ ముగిసిపోతుంటాయి. అన్నీ అనుకూలిస్తే రైతు ఇంట కాసుల పంటే. ప్రతికూల పరిస్థితులు ఎదురైతే నష్టాలు తప్పవు. ఒక ఎకరా సాగు చేయాలంటే రూ.లక్ష నుంచి నుంచి రూ.లక్షా 20వేల వరకు పెట్టుబడి అవసరం. ఎకరాలో గరిసెన్నర వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కాలం కలిసొస్తే రెండు గరిసెల వరకు కూడా దిగుబడి వచ్చే అవకాశం లేకపోలేదు. మొక్క నాటిన నుంచి 105వ రోజుకు ఆకు పరిపక్వత దశకు చేరుతుంది. తర్వాత ఆకు కోసి తాత్కాలిక పాకల్లో నెలరోజుల పాటు ఆరబెట్టాల్సి ఉంది. అనంతరం 24 కేజీల వంతున ఒక్కో తాటాకు బుట్టల్లో నిల్వ చేస్తుంటారు. అటువంటి 30 బుట్టల పొగాకును కలిపితే ఒక గరిసెగా లెక్కిస్తుంటారు. గరిసె పొగాకు ధర రూ.లక్ష నుంచి రూ.లక్షా 50వేల వరకు ఉం టుంది. చింతూరు డివిజనులో పండించిన పొగాకును రాజమండ్రి పరసర ప్రాంతాలైన ములకల్లంక, సీతానగరం, చివిడిలంక, కొత్తపేట తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. కాగా గతేడాది గుంటూరుకు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ రంగంలోకి దిగింది. విదేశాలతో ఒప్పందం కుదుర్చుకున్న ఆ కంపెనీ శబరి లంకల్లో పండించిన గరిసె పొగాకును రూ.2 లక్షల 30 వేల వరకు ధర వెచ్చించి కొనుగోలు చేసింది. ఇదొక చరిత్రగా రైతులు అభివర్ణిస్తున్నారు. అంతేకాదు ఈ ఏడాది కూడా తామే కొనుగోలు చేస్తామని సదరు కంపెనీ రైతులతో ఒప్పందం చేసుకుంది. ఆ కంపెనీ ఇతర దేశాలకు శబరి లంక పొగాకును ఎగుమతి చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగింది.



క్రిస్మస్ ‘ట్రీ’

లూథర్‌గిరిలో ఆకట్టుకుంటున్న స్టార్స్‌తో అలంకరించిన చెట్టు

క్రిస్మస్ సందడి ఆరంభమైంది. చర్చిలు, క్రైస్తవ మిషనరీ సంస్థల కార్యాలయాలు, క్రైస్తవ సోదరుల గృహాలను విద్యుద్దీపాలతో అలంకరణలు చేసుకుంటున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు, ధవళేశ్వరం, అనపర్తి, కోరుకొండ, నిడదవోలు తదితర ప్రాంతాల్లో పురాతన చర్చిలను ముస్తాబు చేశారు. రాజమహేంద్రవరంలోని పురాతన చర్చ్ సెయింట్ పాల్స్, సెయింట్ పీటర్, లూథర్‌గిరి చర్చిలు సందడిగా మారాయి. లూథర్‌గిరిలో ఒక చెట్టుకు స్టార్లను ఏర్పాటుచేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం సిటీ


హెచ్‌సీ అబ్రహంకు ప్రసంసాపత్రం అందిస్తున్న దీపిక

కాంస్య పతకం సాధించిన ఏపీఎస్పీ హెచ్‌సీ అబ్రహం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల నాగాలాండ్ రాష్ట్రం దీమాపూర్‌లో నిర్వహించిన 25వ అఖిల భారత పోలీస్ బ్యాండు పోటీల్లో బిగిల్ కాల్ పోటీలో ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించిన ఏపీఎస్పీ హెడ్‌కానిస్టేబల్ ఎస్ అబ్రహాన్ని ఏపీఎస్పీ కమాండెంట్ ఎం. దీపిక అభినందించారు. మంగళవారం కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ బెటాలియన్‌లో అబ్రహాన్ని అభినందించి ప్రశంసాపత్రాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 24 టీమ్‌లు పాల్గొనగా ఏపీఎస్పీ.. ఏపీ పోలీస్ బిగిల్ టీం కాంస్య పతకం సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు పాల్గొన్నారు.

డ్రైవర్ చేతిలోకి గేర్ రాడ్!

ఏడీబీ రోడ్డులో ఘటన.. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు



రాజానగరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం.. సుఖమయం.. ఇది సంస్థ ట్యాగ్‌లైన్.. ఇటీవల ఆర్టీసీ బస్సులను చూస్తే మాత్రం ఎక్కడ ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంభయంగా ఉంటోంది.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.. అదేదో సినిమాలో కామెడీ కోసం.. స్పీడ్‌గా వెళుతున్న బస్‌లో స్టీరింగ్ ఊడి చేతిలోకి వచ్చేస్తుంది.. అచ్చంగా ఇలాగే మంగళవారం వేగంగా వెళుతున్న ఒక ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు స్టీరింగ్ ఊడి చేతికి వచ్చేయడంతో అటు డ్రైవర్.. ఇటు ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. కాకినాడ జిల్లా తూర్పు గోదావరి జిల్లాల మధ్య ఉండే ఏడీబీ రోడ్డు గత ఐదేళ్లగా కనీస మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఎక్కడికక్కడ గోతులతో నిండి ఉంది. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్డు పనులు ఆరంభించినా ఇంకా పూర్తికాలేదు. ఆ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడ నుంచి రాజమహేంద్రవరానికి ఏపీ 05 జడ్ 5247 ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు బయలుదేరింది. అందులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. నాన్‌స్టాప్ కావడంతో బస్ వేగంగా వెళుతోంది. 3.30 గంటలకు తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం రామస్వామిపేట సమీపంలోకి వచ్చేసరికి పెద్ద గొయ్యి కనబడడంతో డ్రైవర్ స్లో చేద్దామని గేర్ రాడ్డుపై చేయి వేశాడు.. అంతే గేర్ రాడ్డు ఊడి చేతిలోకి వచ్చేసింది. దీంతో డ్రైవర్ హతాశుడయ్యాడు.. ఇది గమనించిన బస్సులోని ప్రయాణికులు భయంతో వణికిపోయారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బస్సును నెమ్మదిగా అదుపుచేసి రహదారి పక్కన నిలపడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. దీంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్‌కు అభినందనలు తెలిపారు.

వాడపల్లి వెంకన్న కార్తీక ఆదాయం రూ.3.37 కోట్లు

ఈవో సూర్యచక్రధరావు వెల్లడి



ఆత్రేయపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని కార్తీక మాసంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. దీంతో అధిక ఆదాయం లభించింది. ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు కార్తీకమాస ఆదాయం రూ.3,37,13,952 లభించిందని తెలిపారు. ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, వేదాశీర్వచనం, లడ్డూ విక్రయాలు, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవల ద్వారా ఈ మొత్తం లభించిందన్నారు. భక్తుల సౌకర్యార్థం మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్టు వివరించారు.

అన్నవరం దేవస్థానం పీఆర్వోగా కొండలరావు

పలువురికి అంతర్గత బదిలీలు

అన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం పీఆర్వోగా కె.కొండలరావును నియమిస్తూ ఈవో త్రినాధరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ క్యాడర్లలో 14మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇప్పటివరకు పీఆర్వోగా ఉన్న బీవీ రెడ్డికి లీజులు, రవాణా, సెక్యూరిటీ బాధ్యతలు అప్పగించారు. సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్‌ను రిసెప్షన్ బాధ్యతల నుంచి తప్పించారు. కేవలం సెంట్రల్ స్టోర్స్ మాత్రమే చూడాలన్నారు. కె.సూర్యనారాయణకు రవాణా, జె.రామకృష్ణకు అన్నదానం, ఎంవీకే సుబ్రహ్మణ్యానికి ఆలయ రిసెప్షన్ విభాగాలు కేటాయించారు. సీనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో గంటా విష్ణుకు రెండువేల వ్రతాలు, రిసెప్షన్, రికార్డ్ అసిస్టెంట్ సంగన వీర్రాజుకు 1500 వ్రతాలు కేటాయించారు. కోరుకొండ ఆలయ లెక్కల్లో అవకతవకలు ఆరోపణలు ఎదుర్కొన్న అనిల్‌కుమార్‌కు కంప్యూటర్ వర్క్, కొంతం సతీష్‌కు పరిపాలనా విభాగ బాధ్యతలు అప్పజెప్పారు.




డిస్క్‌త్రో చేస్తున్న దివ్యాంగ విద్యార్థి, విజేతకు బహుమతి ప్రదానం

ఆటపాటలతో సందడి

కాకినాడలో వేడుకగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటపాటలతో విభిన్న ప్రతిభావంతులు సందడి చేశారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఇందుకు వేదికగా నిలిచింది. కాకినాడ జేఎన్టీయూ అలుమ్ని ఆడిటోరియంలో మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ పూర్తి అదనపు బాధ్యతల సహాయ సంచాలకుడు వీవీఎస్ లక్ష్మణరావు ఆధ్యక్షత వహించారు. విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక పాఠశాల ఉమామనోవికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ రామారావు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ కో-ఆర్డినేటర్ సీహెచ్ సుబ్బారావు, అంధ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణికంఠస్వామి, ఆశ్రయ వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు పి.సురేష్‌కుమార్ అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. విభిన్న ప్రతిభావంత విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, 351 మందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కోరుకొండ మండలం మధురపూడిలోని కన్నా ఆశ్రయ్ మానసిక దివ్యాంగుల కేంద్రం విద్యార్థులకు మొత్తం 12 బహుమతులు లభించాయి. విభిన్న ప్రతిభావంతులకు ఉత్తమ సేవలందిస్తున్న సంఘాల ప్రతినిధులు 34 మందిని, స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ప్రత్యేక పాఠశాలలు నిర్వహిస్తున్న ప్రతినిధులను సత్కరించారు. పులిమేరు శాంతివర్ధని స్పెషల్ పాఠశాల ప్రతినిధి, మహర్షి బులుసు సాంబమూర్తి పాఠశాల హెచ్‌ఎం, కాకినాడ ప్రభుత్వ బధిరుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సామర్లకోట సిరి స్పెషల్ పాఠశాల ప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతుల సేవా సంస్థల ప్రతినిధులు జి.కొండలరావు, నిమ్మకాయల సురేష్, కొసన సత్య సుబ్రహ్మణ్యం, బీవీవీ సత్యనారాయణ, యు శ్రీనివాస్, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులు, సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


స్వచ్ఛంద సంస్థ ప్రతినిధికి సత్కారం

ఘనంగా అయ్యప్ప పడి పూజ


18 మెట్లపై దీపాలు వెలిగించిన దృశ్యం

మోతుగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి తెల్లవారుజామున నాలుగు గంటలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సత్తిబాబు, జి.రవి సాయంతో మధ్యాహ్నం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. సాయంత్రం 18 కలశాలతో పడి పూజ ఘనంగా జరిగింది. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు దంపతులు, సీనియర్ అక్కౌంట్స్ ఆఫీసర్ వరప్రసాద్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెంటకోట సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన పూజలో అయ్యప్ప కమిటీ సభ్యులు టి.ప్రసాద్, పప్పు చిరంజీవి, జి.రవి, సత్తిబాబు, నాగేష్ రాజా, శ్రీను, భీమరాజు, పప్పు వెంకటేశులతో పాటు మోతుగూడెం, సీలేరు, డొంకరాయి, ఫోర్‌బై, పొల్లూరు, చింతూరు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంటకు చెందిన అనేక మంది స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

నేడు, రేపు రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికలు

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4, 5 తేదీల్లో సామర్లకోట సీనియర్ సెక్షన్ ఇంజనీరు కార్యాలయంలో పోలింగ్ జరుగుతుందని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సామర్లకోట బ్రాంచి కార్యదర్శి ఎం.రమేష్ మంగళవారం రాత్రి తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుంది, సామర్లకోట బ్రాంచి పరిధిలో అటు కేశవరం నుంచి ఇటు హంసవరం వరకు గల సుమారు 650 మంది రైల్వే కార్మికులను బరిలో ఉన్న వివిధ కార్మిక యూనియన్ల నాయకులు కలిసి తమ సంఘాన్ని బలపరచాల్సిందిగా అభ్యర్థించారు. రైల్వే కార్మికులకు అత్యంత ప్రతిష్టాత్మకం అయిన ఈ గుర్తింపు ఎన్నికల్లో ఆధిపత్యం నిరూపించుకునేందుకు పోటీ హోరాహోరీగా సాగనుంది. ఈ నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రమణీయం... శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

వైభవంగా శ్రీయాగ సహిత సుదర్శన నారసింహ యాగం

కాకినాడ భానుగుడి సెంటరు నుంచి వేలాది మంది భక్తులతో శోభాయాత్ర



సర్పవరం జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని పాలకులు సుభిక్షమైన పాలన అందించి, ప్రగతి పథంలో పయనింపచేసేందుకు కృషి చేయాలని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయరు స్వామి పేర్కొన్నారు. మంగళవారం కాకినాడ జేఎన్టీయూ ఎదురుగా గల మైదానంలో శ్రీరామ సేవా సమితి, వికాస తరంగిణి, శ్రీవారాహి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామ పాదుకా పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. వారం పాటు నిర్వహించే విశ్వశాంతి శ్రీయాగ సహిత సుదర్శన నారసింహ యాగాన్ని వైభవంగా ప్రారంభించారు. వేలాదిగా హాజరైన భక్తులకు జీయరు స్వామి అనుగ్రహభాషణ చేశారు. శ్రీరామచంద్రుడు మానవత్వం, సేవాతత్పరతతో సమాజ అభివృద్ధికి ఇతోధిక కృషి చేశారన్నారు. కులమతాలకతీతంగా సమస్త జనులపై ప్రేమ, వాత్సల్యం చూపించిన మహనీయుడు శ్రీరాముడు అన్నారు. సత్యవ్రతుడైన శ్రీరాముడు భరతుని కోరిక తిరస్కరించగా, శ్రీరామ పాదుకలనాశ్రయించిన భరతుడు రామరాజ్యాన్ని తరించాడన్నారు. సర్వమానవాళి దోషాలను తొలగించే విధంగా శాంతి, సమాజ శ్రేయస్సులను ప్రజలకు అందించి పాదుకా పట్టాభిషేకం తలపెట్టారన్నారు. శ్రీరామ పాదుకారాధన వైభవాన్ని భరతుడు లోకానికి చాటగా, రామ పాదుకా మహిమను ఎందరో విశిష్టంగా కొనియాడారన్నారు. శ్రీరామ పాదుకల విశిష్టత, చరిత్ర ఘట్టాలను రామాయణ సంస్కృత శ్లోకాలతో వివరించారు. తొలుత చినజీయరు స్వామి స్వీయ పర్యవేక్షణలో కాకినాడ భానుగుడి సెంటరు నుంచి జేఎన్టీయూ ప్రాంగణానికి వేలాది మంది భక్తులతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామ్‌నారాయణ్ పెరుమాళ్ పీఠాధిపతి శృంగారం తిరువేంగళ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


చినజీయరు స్వామి భాషణను వింటున్న భక్తులు

కాకినాడ పోర్టులో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

విజయవాడ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండేందుకు అందరూ సహకరించాలని విజయవాడ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేని పీడీఎస్ బియ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రవాణా చేయకుండా ఎగుమతి, దిగుమతి దారులు, ఛాంబర్ ప్రతినిధులు, ఏజెంట్లు వ్యాపారులు సహకరించాలన్నారు. మంగళవారం కాకినాడ కస్టమ్స్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు.అయన మాట్లాడుతూ కాకినాడ ఓడరేవులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 24గంటలు పనిచేసేలా ఒక చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ వివిధ వాహనాల ద్వారా సరఫరా అయ్యే సరుకులు పౌరసర ఫరాలశాఖ నుంచి నిరభ్యంతక పత్రం, బిల్లులు తీసుకున్న తర్వాతే ఎగుమతికి అనుమతించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణరాజు యాదవ్, అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, ఎసీసీ జీ.నాయుడు, ఎంకరేజ్ ఆఫీసర్ ధర్మశాస్త్ర, జిల్లా రైస్ ఎగుమ తిదారుల సంఘం అధ్యక్షుడు బీవీ కృష్ణారావు, స్టీవ్ డోర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

రూ.3లక్షల నగదు, 48గ్రాముల బంగారం స్వాధీనం


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

ఆలమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్లలో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రూ.3లక్షల నగదు, 48గ్రాములు బంగారం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ కేసు వివరాలను వెల్లడించారు. చొప్పెల్ల గ్రామంలో విశ్వనాధుల వీరభద్రరావు ఇంట్లో నవంబరు 25న రాత్రి దొంగతనం జరిగింది. వీరభద్రరావు 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్, ఇన్‌చార్జ్ ఎస్ఐ రాము ఆధ్వర్యంలో జరిగిన విచారణలో ఈనెల 3న సీఐ విద్యాసాగర్ చొప్పెల్ల సెంటర్లో ఇద్దరు నిందితులను రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలుకు చెందిన తమ్మ వినోద్‌కుమార్, ఏలూరు పవన్‌కళ్యాణ్‌ను అరెస్టు చేసి విచారించారు. వారి నుంచి రూ.3లక్షల నగదు, 48గ్రాముల బంగారు నక్లెస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆలమూరు ఇన్‌చార్జి ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు. ఈ కేసు చేధించడంతో కీలకంగా నిలిచిన కొత్తపేట డీఎస్పీ గోవిందరావు, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ అశోక్, ఇన్‌చార్జ్ ఎస్ఐ రాము, ఇబ్బంది ఎస్.ట్లేసన్, పి.గంగాధర్, బి. నెహ్రూ, బి.శ్రీనివాసరావు, సీహెచ్.దుర్గాప్రసాద్, పి.రాజు, కెవీ.రవికుమార్‌లను ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

తాటిపాకలో పట్టపగలే చోరీ

17 కాసుల బంగారం.. అర కిలో వెండి, రూ.లక్షా 10వేల నగదు దొంగతనం


తాటిపాకలో చోరీ జరిగిన ఇంట్లోని బీరువాను పరిశీలిస్తున్న రాజోలు ఎస్ఐ రాజేష్‌కుమార్

రాజోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాక సెంటర్‌లో గుబ్బల తాతారావుకు చెందిన ఇంట్లోకి సోమవారం సాయంత్రం దొంగలు చొరబడి 17 కాసుల బంగారం, అరకిలో వెండి, రూ.లక్షా 10వేల నగదు మొత్తం రూ.4లక్షల 70 వేలు సొత్తును దోచుకువెళ్లారని రాజోలు ఎస్ఐ బి. రాజేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం... తాటిపాక సెంటర్‌లో తాతారావు తూకం దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణం ఎదురుగా ఉన్న రోడ్డు గల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇంటికి తాళం వేసి యథావిధిగా సోమవారం ఉదయం భార్యాభర్తలిద్దరూ దుకాణానికి వచ్చారు. మళ్లీసాయంత్రం 6 గంటలకు ఇంటికి వెళ్లి చూడగా బీరువా పగులకొట్టి, దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వెంటనే తాతారావు రాజోలు పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ రాజేష్‌కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. తాతారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏపీటీలో పాలీటెక్ ఫెస్ట్ ప్రారంభం

కాకినాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని నైపుణ్యాల ప్రదర్శనకు టెక్ ఫెస్ట్ చక్కని వేదికని జేఎన్టీయూకేలోని యూసీఈకే ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు అన్నారు. కాకినాడ ఏపీటీలో నిర్వహించిన ప్రాంతీయ పాలీటెక్ ఫెస్ట్-2024ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జనార్ధనరావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మోహన్‌రావు, గౌరవ అతిథులుగా కేఎస్‌పీఎల్ డీజీఎం పి.రవికుమార్, రామసత్యనారాయణ, సురేష్ హాజరయ్యారు. సాంకేతిక విద్యా శాఖ, ఏపీప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల 20 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 117 ప్రాజెక్టులను ప్రదర్శించారు. కాకినాడ జిల్లాలో గల 21 మండలాల నుంచి పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలను తిలకించారు. పాలీటెక్ ఫెస్ట్ బుధవారం కూడా కొనసాగనుందని ప్రిన్సిపాల్ తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

దమ్ము ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

రాజానగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం నమ్ముకున్న ట్రాక్టరే మృత్యుశకటమైంది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నరేంద్రపురంలో పొలంలో దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ తిరగబడి డ్రైవర్ మృతిచెందాడు. గ్రామానికి చెందిన వెలుగుల శివ(31) గ్రామంలో దాళ్వా సీజన్‌కు సంబంధించి మంగళవారం దమ్ము చేస్తూ ట్రాక్టర్ గట్టు ఎక్కుతుండగా వెనక్కి తిరబడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో శివ బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతిచెందాడు. దీనికి తోడు ట్రాక్టర్ ట్యాంకులోని వేడెక్కిపోయిన డీజిల్ కూడా డ్రైవర్ శరీరంపై పడడంతో ఒళ్లంతా గాయాలయ్యాయి. ప్రోక్లెయినర్ సహాయంతో ట్రాక్టర్‌ను తొలగించి బయటకు తీసేసరికి శివ అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా శివకు భార్య, ఓ బాబు, పాప ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మనోహర్ తెలిపారు.


సంఘటనా స్థలంలో మృతి చెందిన డ్రైవర్ శివ

రుడాకు కొత్త మాస్టర్ ప్లాన్

- 3వేల చదరపు మీటర్ల మేర అమలు యోచన
- పుష్కరాల నాటికి రివర్‌ఫ్రంట్ సుందరీకరణ
- ఈనెల 31 నుంచి భవన అనుమతులు సులభతరం
- ఆంధ్రజ్యోతితో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి


రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి

రాజమహేంద్రవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ప్రయత్నాలు ప్రారంభించాం. గుడా ఉండగా సుమారు 200 చదరపుకిలోమీటర్ల పరిధిలో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. కానీ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో రుడా పరిధిలోని మొత్తం ఏరియాను కలుపుతూ సుమారు 3 వేల చదరపు కిలోమీటర్లు కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నట్టు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. దేశంలోనే మంచి ఎక్స్‌పర్ట్‌లైన కన్సల్టెన్సీలతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. రుడా పరిధిలో తూర్పుగోదావరి జిల్లాతో పాటు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట, మండపేట నియోజకవర్గాల్లోని కొంతభాగం, రామచంద్రపురం టౌన్ కూడా ఉందన్నారు. మొత్తం ఏరియాని అర్బనీకరించే విధంగా విశాలమైన రోడ్లు, వాన నీరు ఎక్కడా నిల్వలేకుండా ఉండడం కోసం స్టార్మ్‌వాటర్ డ్రైనేజీ సిస్టమ్, గ్రామాల్లో కూడా పారిశుధ్య సమస్యలు లేకుండా చూడడం కోసం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్‌ను మండల పరిధిలోకానీ,నియోజకవర్గ పరిధిలో కానీ చేసేట ట్టు ఉంటే బాగుంటుందనే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మంచినీటి సరఫరా కూడా అన్ని ప్రాంతాలకు ఉండే విధంగా ఈ మాస్టర్‌ప్లాన్‌లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పార్కులు, స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పేదల కోసం వెల్ఫేర్ హౌసింగ్, మధ్య తరగతి ఇతర వర్గాలకు ఎఫర్డబుల్ హౌసింగ్, ఇండస్ట్రియల్ టౌన్ షిప్‌కు అనుకూలంగా మాస్టర్ ప్లాన్ ఉంటుందన్నారు. హౌసింగ్ ఇతర సౌకర్యాలను రుడా, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో రూపొందించనున్నట్టు స్పష్టం చేశారు. రుడా ద్వారా ప్రజల ఇళ్లు, ఇతర నిర్మాణాల విషయంలో ఇబ్బందులు లేకుండా చూస్తామని, ఈ నెల 31 నుంచి జీ ప్లస్ 5 అంతస్తుల వరకూ ఎవరు భవనాలు నిర్మించుకున్నా ఆఫీసుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగన వసరం లేదన్నారు. లైసెన్స్ సర్వేయర్‌తో ప్లాన్ గీయించుకుని.. ఆన్‌లైన్‌లో పెడితే అదే డీమ్డ్ అప్రూవల్ అవుతుందన్నారు. పనులు ఆరంభించే టప్పుడు రుడా, ఆర్ఎంసీ సిబ్బంది ఎవరైనా వచ్చి పరిశీలించి ఎన్‌వోసీ ఇస్తారన్నారు. ఇక ఎవరి ప్రమేయం లేకుండా కట్టడం నిర్మించుకోవచ్చని చెప్పారు. రుడా ద్వారా ప్రభు త్వానికి ఆదాయం వచ్చే మార్గాలు పరిశీలిస్తున్నామని, ఖాళీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడంతోపాటు పార్కుల వద్ద షాపులు నిర్మిస్తామన్నారు. వీటి అద్దెల ద్వారా ఆదాయం వస్తుందని చెప్పారు. మినీ సోలార్ ప్లాంట్లు నిర్మించే ఆలోచన ఉందన్నారు.

అన్ని ప్రాంతాల్లో సుందరీకరణ..

2027లో వచ్చే గోదావరి పుష్కరాల నాటికి గోదావరిని ఆనుకుని ఉన్న అన్ని ప్రాంతాల్లో రివర్‌ఫ్రంట్ సుందరీకరణ చేస్తామని చైర్మన్ తెలిపారు. రాజమహేంద్రవరం సిటీలో పర్వాలేదని, దానితో పాటు రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడదవోలు, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే మొత్తం రివర్‌ఫ్రంట్‌ను సుందరీకరించి..కనీసం సైకిల్ వాక్‌కు అనుకూలంగా ఉండేటట్టే చేసే ఆలోచన ఉందన్నారు. రుడా పరిధిలో గత ప్రభుత్వంలో చేసిన పనుల నిర్వహణ ఎవరనేది స్పష్టత లేదని, అనేక గ్రామాల్లో జిమ్‌లు నిర్మించినా నిర్వహణ బాధ్యత ఎవరికీ అప్పగించకుండా వది లేశారన్నారు. తాము దీర్ఘకాలిక ప్రయోజనంతో పాటు నిర్వహణ కూడా ఉండే పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు స్పష్టంచేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మీటింగ్ పెట్టి గతంలో అనుమతుల్లేకుండా కట్టిన కట్టడాలు, వచ్చే ఆదాయం వంటి వాటిపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

కీచక ఉపాధ్యాయులు!

- నాగుల్లంకలో విద్యార్థినులపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు
- సండే స్కూలు టీచర్ వద్ద విషయం బయటపెట్టిన విద్యార్థినులు
- ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు, స్థానికులు
- బొమ్మూరులో బాలికను లైంగికంగా వేధించిన హిందీ ఉపాధ్యాయుడి అరెస్ట్


నాగుల్లంకలో ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేస్తున్న తల్లిదండ్రులు, పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

పి.గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పుతూ తండ్రి స్థానంలో ఉండవల్సిన ఉపాధ్యాయుడు గురువు అనే పదానికే మాయని మచ్చ తెచ్చాడు. చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతూ తన వెకిలి చేష్టలతో పిల్లలను ఇబ్బందిపెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్న ఆ ఉపాధ్యాయుడికి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక ప్రాథమిక పాఠశాలలో జరిగింది. విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..... రాజోలు మండలం మెరకపాలెం గ్రామానికి చెందిన పిండి శ్రీనివాస్ ఎంటీఎస్ (మినిమమ్ టైమ్ స్కేలు) ఉపాధ్యాయుడిగా మూడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పొన్నమండతో పాటు పి.గన్నవరం మండలంలోని ముంగండ, జొన్నల్లంక ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసి సెప్టెంబరు 11న నాగుల్లంక ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరాడు. 1,2 తరగతులకు హెచ్ఎం కె.గంగాభవానితో పాటు పాఠాలు శ్రీనివాస్ పాఠాలు చెప్పేవాడు. అయితే హైస్కూల్లో తరగతి గదులు లేకపోవడంతో 3,4,5 తరగతులకు ప్రాథమిక పాఠశాలలోనే పాఠాలు చెప్తున్నారు. ఈక్రమంలో గ్రామంలో సండే స్కూలు నిర్వహిస్తున్న చవ్వాకుల వల్లి ప్రతీ వారం విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తుంది. అయితే ఈనెల 2వ తేదీన గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై చెప్తున్న సమయంలో మా స్కూల్లో ఉపాధ్యాయుడు బ్యాడ్ టచ్‌లు చేస్తున్నాడు అంటూ ఓ విద్యార్థి సండే స్కూలు టీచర్ దృష్టికి తీసుకువచ్చింది. అసలు ఉపాధ్యాయుడు ఎలా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థులను వల్లి ఆరా తీయగా ఉపాధ్యాయుడు చేస్తున్న చేష్టలను ఒక్కొక్కటిగా వివరించారు. విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు చేరడంతో హెచ్ఎం గంగాభవానిని నిలదీశారు. దీంతో స్థానిక మహిళ పోలీసు, మండల విద్యాశాఖ అధికారిణి కె.హెలీనా పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఆ కీచక ఉపాధ్యాయుడు ఆరుగురు విద్యార్థులపై చేసిన వికృత చేష్టలు సైతం బయటపడ్డాయి. పైగా విద్యార్థులే మీద పడేవారని, ఆ సమయంలో తగిలి ఉండవచ్చునని ఉపాధ్యాయుడు సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. అంతేకాకుండా ఈ కీచకుడు బాగోతాలను ప్రత్యక్షంగా పాఠశాలలో ఆయా చూసి హెచ్ఎం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. అలాగే విద్యార్థులకు డబ్బులు ఎరగా చూపి మచ్చిక చేసుకునేవాడని విచారణలో బయటకు వచ్చాయి.

ఇదిలా ఉండగా ఆవేదనతో రగిలిపోతున్న విద్యార్థులు తల్లిదండ్రులు, స్థానిక యువకులు ఉపాధ్యాయుడికి పలుమార్లు దేహశుద్ధి చేశారు. పోలీసులు జోక్యంతో స్థానికులు శాంతించగా పాఠశాలకు చేరుకున్న అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవి సిబ్బందితో ఉపాధ్యాయుడిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామని, విద్యార్థుల వాంగ్మూలం నమోదు చేయడంతో పాటు తల్లిదండ్రుల ఫిర్యాదును స్వీకరించి విషయాన్ని డీఈవో షేక్ సలీంబాషాకు తెలియజేసినట్టు ఎంఈవో కె.హెలీనా తెలిపారు. ఈ విచారణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.వెంకటలక్ష్మి, మహిళా పోలీసు పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న ఉపాధ్యాయుడి అరెస్టు

పోక్సో కేసు నమోదు


అరెస్ట్ అయిన ఉపాధ్యాయుడు సత్యనారాయణ

ధవళేశ్వరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరులో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో బాలికను లైంగికంగా వేధించిన హిందీ ఉపాధ్యాయుడు తంగేటి సత్యనారాయణపై ధవళేశ్వరం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సీఐ టి.గణేష్ మంగళవారం సత్యనారాయణను అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించింది.

శివోహం

పిఠాపురంలో వైభవంగా శివస్వాముల నగరోత్సవం


పిఠాపురంలో రథాన్ని లాగుతున్న దృశ్యం

పిఠాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వాముల శివనామస్మరణతో కాకినాడ జిల్లా పిఠాపురం మార్మోగింది. శివస్వాముల నగరోత్సవం వైభవంగా జరిగింది. శివమాల ధరించి దీక్ష పూర్తి చేసిన స్వాములకు మంగళవారం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో ఇరుముడిధారణ జరిగింది. అర్చక, గురుస్వాములు స్వాములను ఇరుముడి ధరింపచేశారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో శివస్వాముల నగరోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఉంచి వీధుల్లో లాగారు. రథోత్సవాన్ని పాదగయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ప్రార ంభించారు. కొంతదూరం స్వామి రథాన్ని లాగారు. అనంతరం శివనామస్మరణ చేసుకుంటూ డప్పులు వాయిద్యాలతో ముందుండగా పట్టణంలో శివస్వాములు ప్రదర్శనగా తిరిగారు.


నగరోత్సవంలో పాల్గొన్న శివస్వాములు

ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

- మున్సిపల్ ఆర్డీ నాగ నరసింహారావు
- ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని మున్సిపల్ ఆర్డీ సీహెచ్. నాగ నరసింహారావు అన్నారు. మంగళవారం రామచంద్రపురం పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి సమస్యలు మన దృష్టికి తీసుకువచ్చినా వాటికి పరిష్కారం చూపే బాధ్యత అందరిపైన ఉందన్నారు. ప్రజా సమస్యలు సామరస్యధోరణిలో స్వీకరించి వాటికి పరిష్కారం సాధ్యమైనంత త్వరగా చూపితే ప్రజల్లో పురపాలక సంఘాల పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. తడిచెత్త పొడి చెత్త రీసైక్లింగ్ చేయడం కారణంగా పురపాలక సంఘానికి ఆదాయం సమకూరుతుందన్నారు. కంపోస్టు యార్డు స్థలాలు కూడా సరిపోతాయన్నారు. లేకపోతే కంపోస్టు యార్డు ఎంత స్థలం ఉన్నా సరిపోదన్నారు. పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉంటున్న తరుణంలో ఆదివారం పారిశుధ్య కార్మికులు, శానిటరీ కార్యదర్శులను ఉపయోగించుకుని బదులుగా వారికి అవసరమైన రోజు సెలవులు మంజూరు చేయాలన్నారు. వీలును బట్టి సిబ్బందిని సర్దుబాటు చేయాలన్నారు. పురపాలనకు సంబంధించి ఆస్తిపన్నులు వసూలు, పన్నులు విధింపు, పారిశుధ్యం, లిక్విడ్‌వేస్ట్ మేనేజ్‌మెంటు, సోలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంటు, వీకల్ స్ట్రక్చర్ మేనేజుమెంటు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇతర అభివృద్ధి పనులు, ఇతర విషయాలపై అంశాల వారీగా పురపాలక సంఘాలపై అధికారులతో సమీక్ష చేశారు. రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ వి.అయ్యప్పనాయుడు, డీఈ శ్రీకాంత్, సూపరింటెంట్ జి.రాధాకృష్ణ, మండపేట, అమలాపురం, మండపేట, కొవ్వూరు, నిడదవోలు కమిషన్లు, ముమ్మిడివరం కమిషనర్, పురపాలక సంఘాల అన్ని విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యను పరిష్కరించే వరకు పోరాటం'

గోకవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ బాధితుల సమస్యను పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని సామాజిక ఉద్యమనేత పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. గ్రామంలోని దళితవాడలో అస్సాగో బాధితులను మంగళవారం ఆయన, తన సతీమణి శ్రీదేవితో కలిసి పరామర్శించారు. సూర్యచంద్ర మాట్లాడుతూ పరిశ్రమ నుంచి వెలువడే వాయు, శబ్ద, జల కాలుష్యాలను నియంత్రించాలని 3నెలలుగా ప్రజలు నిరసనలు తెలియజేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం, పైగా 144సెక్షన్ విధించి గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. సమస్యను పూర్తిగా పరిష్కరించేవరకు ప్రజల తరుపున తన పోరాటం ఆగదన్నారు. దీనిలో భాగంగా ప్రతీ ఇంటి వద్ద ప్రభుత్వానికి తెలిసేలా నల్ల జెండాను ఏర్పాటు చేయాలని బాధిత గ్రామాల ప్రజలకు సూర్యచంద్ర పిలుపునిచ్చారు. సూర్యచంద్ర దంపతుల వద్దకు పోలీసులు చేరుకుని శాంతిభద్రతల దృష్ట్యా గ్రామంలో సమావేశాలు, సభలు ఏర్పాటు చేయరాదని సూచించారు. జగ్గంపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి మరొతి శివగణేష్ గ్రామంలోకి వస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కాగా గ్రామంలో 144 సెక్షన్‌ను అతిక్రమించిన సూర్యచంద్ర, శివగణేష్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.


జగ్గంపేట కాంగ్రెస్ ఇన్‌చార్జిని అడ్డుకున్న పోలీసులు

ఏజెన్సీలో పులి కలకలం!

రెండు మేకలను హతమార్చిందని అంటున్న గిరిజనులు
ప్రజలను అప్రమత్తం చేసిన అటవీశాఖ అధికారులు
పాదముద్రల ఆధారంగా గుర్తించే ప్రయత్నం


అధికారులు గుర్తించిన పాద ముద్రలు

రాజవొమ్మంగి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో చాలా రోజుల తరువాత పులి సంచరిస్తుందనే సమాచారం గిరిజన ప్రాంత ప్రజల్లో కలకలం రేపింది. మండలంలోని గడువకుర్తి పంచాయతిలో సోమవారం మేకల మందపై పులి దాడి చేసి రెండు మేకలను హతమార్చిందని గిరిజనులు చెపుతున్నారు. ఆ సమాచారం మేరకు సోమవారం రాత్రి, మంగళవారం అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని క్షుణంగా పరిశీలించారు. దోనెలపాలెం-గొబ్బిలమడుగు గ్రామాల మార్గమధ్యలో గండిపై పులి స్థావరంగా ఏర్పాటు చేసుకుని నిత్యం అక్కడే ఉంటుందని, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు అదే గండిపై కూర్చొని ఉందని ప్రజలు చెపుతున్నారు. మంగళవారం ఆ ప్రాంతాన్ని అటవీశాఖ రేంజ్ అధికారి ఉషారాణి సిబ్బందితో కలిసి పరిశీలించారు. పాదముద్రలను అధికారులు గుర్తించి కొలతలు తీసుకున్నారు. పులిని చూశామని చెపుతున్న వారి నుంచి అధికారులు వివరాలు సేకరించారు. ఉషారాణి మాట్లడుతూ అటవీ జంతువు ఈ ప్రాంతంలో తిరిగినట్టు పాదముద్రలు ఉన్నాయని, ఏ జంతువు అనేది వాటి పాదముద్రల ఆధారంగా గుర్తించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అవసరమైతే అనుమానాస్పద ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు పెడతామన్నారు. అలాగే గొబ్బిలమడుగు, లంగుపర్తి, దోనెలపాలెం సమీప గ్రామప్రజలు ప్రయాణాలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అయితే ఆ ప్రాంత ప్రజలు మాత్రం పులి సంచరిస్తుందనే విషయం తెలిసి భయభ్రాంతులకు గురవుతున్నారు.


పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

అపరాధ రుసుం లేకుండా రేపటి వరకూ ఇంటర్ ఫీజు గడువు

ఇంటర్మీడియట్ బోర్డు తూర్పుగోదావరి జిల్లా పర్యవేక్షణాధికారి నరసింహం

రాజమహేంద్రవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మార్చి-2025 ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అపరాధ రుసుం లేకుండా ఈనెల 5లోపు చెల్లించవచ్చని ఇంటర్మీడియట్ బోర్డు తూర్పుగోదావరి జిల్లా పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలని సూచించారు.

నీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష

అల్లవరం,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలు, అపార్ ఐడీ, ఉపాధి హామీ రోడ్ల అంశాలపై ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం జరిగింది. ఎంపీడీవో కృష్ణమోహన్, తహశీల్దారు నరసింహారావు మాట్లాడుతూ ఆయా పనుల పురోగతిని మెరుగుపర్చుకోవాలన్నారు. పీఆర్ ఏఈ ఫకీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి పాల్గొన్నారు.

ఆర్టీసీలో 10 శాతం రాయితీ

అమలాపురంరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, విశాఖపట్నం ప్రాంతాలకు నడుపుతున్న ఆర్టీసీ ఏసీ అమరావతి, నైట్‌రైటర్, ఇంద్ర బస్సు సర్వీసుల్లో ప్రయాణించే ప్రయాణికులకు టిక్కెట్ ధరలో డిసెంబరు 31వరకు 10శాతం రాయితీ కల్పిస్తున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్‌ఎస్ఎన్ మూర్తి తెలిపారు.

మొలకెత్తుతున్న ధాన్యం

● ధాన్యం ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నం



ముమ్మిడివరంలో ధాన్యం రాశులను ఆరబెట్టుకుంటున్న రైతులు



మొలకెత్తిన ధాన్యం

ముమ్మిడివరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ బలహీనపడి సోమవారం నుంచి వాతావరణం తెరిపివ్వడంతో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. తుఫాన్ ప్రభావం కారణంగా శుక్రవారం నుంచి మూడు రోజులు వర్షాలు కురవడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. జిల్లాలో 1,57,812ఎకరాల్లో వరి సేద్యం కాగా ఇప్పటి వరకు 98,004ఎకరాల్లో వారి మాసూలైంది. దీనికి సంబంధించి లక్షా 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయగా ఇంకా రైతుల వద్ద లక్షా 36వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంది. ఈధాన్యమంతా రైతుల కళ్లాల్లోను, చేలల్లోను, రాశులుగా ఉన్నాయి. వర్షాలకు ఈరాశుల అడుగుభాగానికి వర్షపు నీరు చేరడంతో కొంత ధాన్యం దెబ్బతింది. ఆకాశం తెరిపివ్వడంతో ఆ ధాన్యం రాశులను ఆరబెట్టుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అయితే ఆరిన ధాన్యాన్ని అక్కడక్కడ కొనుగోలు చేసే ప్రక్రియ కూడా కొనసాగుతుంది. మిషనుతో కోసిన ధాన్యాన్ని వెంటవెంటనే రాశులుగా వేయడంతో నాలుగు రోజుల పాటు ఆకాశం తెరిపివ్వక ఆ ధాన్యం రాశులు టార్పాలిన్ల కిందే ఉండిపోయాయి. దీంతో అవి రంగు మారి ధాన్యం అడుగు భాగా మొలకెత్తడం ప్రారంభమైంది. దీంతో రైతులు ఆ ధాన్యం రాశులను మరోచోటకు మార్పు చేసుకుని మొలకెత్తిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే ప్రయత్నాన్ని ప్రారంభించారు. ఆకాశం ఇంకా మబ్బులుగా ఉండడంతో రైతులు వరి కోతలు వాయిదా వేశారు. జిల్లాలో ఇంకా 56,808 ఎకరాల్లో వరి పక్వానికి చేరి ఉండగా, కురిసిన వర్షాలు, వీచిన గాలులకు 3వేల ఎకరాల్లో వరి నేలకొరిగింది. ఆకాశం ఇంకా మబ్బులుగా ఉండడంతో ప్రస్తుతం రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

అభివృద్ధి కలలు కనండి.. సాకారంచేసి చూపిస్తా

ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



మన ఊరు-మన బాధ్యత కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

అంతర్వేది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కలలను సాకారం చేస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అంతర్వేది దేవస్థానం గ్రామంలో సర్పంచ్ పోతురాజు నరసింహారావు(కిశోర్) అధ్యక్షతన నిర్వహించిన మన ఊరు-మన బాధ్యత కార్యక్రమంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రధానంగా తాగునీరు, విద్యుత్, రోడ్లు, పర్యావరణం తదితర అంశాలపై దృష్టి సారించామని, తీర ప్రాంత గ్రామాలతో పాటు రాజోలు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గ్రామాల అభివృద్ధికి రూ.373కోట్లు అంచనా రూపొందించామన్నారు. అవినీతి లేని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని, గ్రామంలో ఉన్న కూటమి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు సహకరిస్తే రాబోయే రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. నెవా రాళ్ల కాల్వ తలుపులను అర్ధచంద్రాకారంలో ఏర్పాటుచేసి తీరప్రాంత గ్రామాలు ముంపునకు గురవ్వకుండా ఇరిగేషన్, హెడ్‌వర్క్స్ అధికారులతో మాట్లాడి అంచనా రూపొందించామన్నారు. తీరప్రాంత గ్రామాల అభివృద్ధిలో భాగంగా పర్యాటకం, ఆధ్యాత్మికం, పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటుచేసి తీర ప్రాంతం, నేషనల్ హైవేకు కనెక్టవిటీతో కూడిన రోడ్డు మార్గాలను ఏర్పాటు చేసేందుకు దీర్ఘకాల కృషికి ప్రణాళికలు వేస్తున్నామన్నారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణం భూమి చుట్టూ ప్రహరీ, ఆలయ ప్రాంగణాన్ని ఎత్తుచేసి గుర్రాల కృష్ణ ఆలయానికి రైతులు ఇచ్చిన 75సెంట్లతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు, సర్పంచ్‌లు పోతురాజు నరసింహారావు (కిశోర్), కొండా జాన్‌బాబు, ఎంపీటీసీలు బైరా నాగరాజు, చొప్పల బాబూరావు, ఎస్ఈ శ్రీనివాస్, డ్రైన్స్ డీఈఈ కిశోర్, నాగేంద్ర, నాగార్జున, జంపన ప్రసాదరావు, అడపా రాంబాబు, మండపాటి వెంకటేశ్వర్లు, ఆకన బాబ్జినాయుడు, గుర్రం సునీల్, పొన్నాల విజయ్, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించుకుని, వాటి బారిన పడకుండా ఉండాలని వక్తలు సూచించారు. ముమ్మిడివరం సామాజిక ఆసుపత్రి ఐసీటీసీ సెంటర్ అమలాపురం జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ, టీఐ ప్రాజెక్టుల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మిడివరంలో అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సాయిశృతి అవగాహనర్యాలీని ప్రారంభించారు. జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ టీఐ ప్రాజెక్టు మేనేజర్ జి.శ్రీను మాట్లాడుతూ జన కల్యాణ్ సంస్థ 2005నుంచి హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు.ఎయిడ్స్ గురించి చర్చిద్దాం.. ఆరోగ్యవంతమైన సామాజాన్ని నిర్మిద్దామంటూ ఆసుపత్రి నుంచి హైస్కూలు సెంటర్ వరకు విద్యార్థులు, ఆసుపత్రి వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యులు డాక్టర్ పృథ్వి, జి.హరికృష్ణకౌశిక్, వైద్య సిబ్బంది వేదామణి, అనిల్‌కుమార్, రాజేశ్వరి, వి.శ్రీనివాస్, జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ సిబ్బంది సీహెచ్ శాంతి, లోకేష్, గుర్రాల అమల, టీడీపీ నాయకులు గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, డ్వాక్రా ఆర్గనైజింగ్ కార్యదర్శి మెండి కమ పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

అంతర్వేది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొంది, గుడిమూల గ్రామాల్లో వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలి

ముమ్మిడివరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువత అవగాహన లోపంతో సైబర్ క్రైమ్‌కు గురవుతున్నారని, సైబర్ క్రైమ్‌కు గురి కాకుండా ఉండాలంటే ఫేస్‌బుక్‌లో ఐడీలు, ఆధారాలు ఎవరికీ ఇవ్వకుండా ఉండాలని ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని స్త్రీశక్తి భవనంలో ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్, కార్మెంట్ సిస్టర్స్ ఆఫ్ తెరిసా, పీపుల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో మూడు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో బొజ్జా రమణశ్రీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా సీఐ మాట్లాడారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఐఎస్ఐ కోఆర్డినేటర్ కె.కరుణరావు, ఎంఈవో బొజ్జా రమణశ్రీలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులందరినీ విద్య వైపు మళ్లించాలన్నారు. ఎస్ఐ జ్వాలాసాగర్, ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. సిస్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో మనోధైర్యాన్ని పెంపొందించేందుకు కృషి: ఆర్డీవో



ఈదరపల్లిలో దివ్యాంగుల దినోత్సవ కేక్ కట్‌చేసిన ఆర్డీవో మాధవి

అమలాపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో మనో ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. వైకల్యంతో ఉన్నవారిపై చిన్నచూపు చూడకుండా ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్న సూచనలతో ప్రతీ ఏటా డిసెంబరు3న అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈదరపల్లిలోని హరి మనోవికాస కేంద్రం(మానసిక దివ్యాంగుల ప్రత్యేకపాఠశాల)లో మంగళవారం దివ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల సమక్షంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో కేక్ కట్‌చేసి వారికి తినిపించారు. హరి మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రాజశేఖర్ చేస్తున్న సేవలను ఆమె అభినందించారు. దివ్యాంగులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వైద్యశిబిరం నిర్వహించారు. పి.ఆనంద్, పి.లోకేశ్, వి.బాబి, కె.కోటి, ఆర్.శాంతకుమార్, రత్నం పాల్గొన్నారు.

శారీరక వైకల్యం ప్రగతికి అవరోధం కాదు

రాజోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజోలు భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని ఎంఈవో ఎస్.మనోహరం అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో బి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శారీరక వైకల్యం అనేది విద్యార్థి విద్యా ప్రగతికి మనో వికాసానికి అవరోధం కాదన్నారు. విజేతలకు రోటరీ క్లబ్, వాసవీక్లబ్, సోమిశెట్టి ల్యాండ్ మార్క్ వారు అందించిన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, సోమిశెట్టి ల్యాండ్‌మార్క్ అధినేత సోమిశెట్టి ఆంజనేయులు, కార్యదర్శి కె.సోమరాజు, అసిస్టెంట్ గవర్నర్ బొరుసు వెంకటతిరుమలరావు, దార్ల పెదబాబు, నార్కేడుమిల్లి బాలకృష్ణ, నామన షణ్ముకేశ్వరరావు, ఐఈఆర్టీ సుబ్బలక్ష్మి, అనిత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం

అంతర్వేది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వీవీ మెరక గ్రామంలోని భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఒక విద్యార్థి తల్లిదండ్రులు భవిత కేంద్రానికి నీటి శుద్ధి యంత్రాన్ని బహూకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కంతేటి వెంకటరామరాజు, సమగ్ర శిక్ష సీఎంవో సుబ్రహ్మణ్యం, ఎంఈవో బి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, జగదీష్, కనకలింగేశ్వరరావు, జెల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సేవలందించే వారే పోటీ చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలందించే నాయకులే నీటి సంఘా ల్లో పదవులు కోసం ముందుకు రావాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. జనసేన పార్టీ క్యాంపు కార్యాలయంలో నీటి సం ఘాల ఎన్నికల నేపథ్యంలో రైతులకు, కూటమి నాయకులకు ఏర్పాటుచేసిన సమావే శంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంట కాల్వలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయ న్నారు. ప్రస్తుతం సాగునీటి సరఫరాలో భారీగా సమస్యలు పేరుకుపోయాయని, వాటిని సంబంధిత మంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లే రైతులు ముందుకు రావాలన్నారు. నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసే వారు పేర్లు రాతపూర్వకంగా అందించాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలోని కూటమి పెద్దలతో చర్చించి అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. కాగా ఎమ్మెల్యే పిలుపుతో జనసేన పార్టీ కార్యాలయానికి భారీస్థాయిలో కూటమి నాయకులు తరలి వచ్చారు. ఆ ప్రాంతం సార్వత్రిక ఎన్నికలను తలపించింది. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, దాసరి వీరవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, తోలేటి సత్తిబాబు, మోల్లేటి శ్రీనివాస్, శ్రీనురాజు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, దొమ్మేటి సాయికృష్ణ, యర్రంశెట్టి సాయిబాబు, చొల్లంగి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా రైతులకు టార్పాలిన్లు సరఫరా



టార్పాలిన్లు అందజేస్తున్న జేసీ నిషాంతి

అయినవిల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 65 సహకార సంఘాలకు రూ.14.40లక్షల విలువైన 800టార్పాలిన్లు అందించినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. వీటిని సహకార సంఘాల ద్వారా అవసరమైన రైతులకు అందజేస్తున్నట్టు వివరించారు. మంగళవారం సిరిపల్లి రైతు సేవా కేంద్రంలో నలుగురు రైతులకు ఆమె టార్పాలిన్లు అందించారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వర్షాల కారణంగా కోల్పోకుండా కాపాడుకోవడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు టార్పాలిన్లు అందిస్తున్నట్టు వివరించారు. జిల్లాలో 151 పీఏసీఎస్‌ల పరిధిలో 221 క్లస్టర్లలో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ముమ్మిడివరం, అమలాపురం కోఆపరేటివ్ సబ్‌డివిజన్‌లో 300టార్పాలిన్లు, రాజోలు సబ్‌డివిజన్‌లో 100, కొత్తపేట సబ్‌డివిజన్‌లో 188, ఆలమూరు సబ్‌డివిజన్‌లో 119, రామచంద్రపురం సబ్‌డివిజన్‌లో 93టార్పాలిన్లను పీఏసీఎస్‌కు అందించామన్నారు. కోనసీమ జిల్లాలోని రైతులకు వీటిని అందించామని జేసీ తెలిపారు. జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మెకానిక్‌లకు ప్రభుత్వం చేయూతనందించాలి

అమలాపురం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ టూవీలర్ మెకానిక్‌ను ప్రభుత్వం గుర్తించి చేయూతనందించాలని శ్రీవరసిద్ధి వినాయక మోటారుసైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.రెడ్డినాయుడు సూచించారు. గొల్లగూడెంలో మంగళవారం రెడ్డినాయుడు అధ్యక్షతనయూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. టూవీలర్స్ మెకానిక్స్ సమస్యలపై గుడివాడ, ఒంగోలు ఎమ్మెల్యేలు రాము, దామచర్ల జనార్దన్ ఇటీవల అసెంబ్లీలో మాట్లాడి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడం శుభపరిణామమన్నారు. కార్మిక శాఖ ద్వారా మెకానిక్‌లకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని సమావేశం తీర్మానించి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోకరకొండ పూర్ణబాల, కూర్మా నరసింహారావు, గుమ్మళ్ల శ్రీను, నల్లా శ్రీనివాసరావు, కాండ్రేగుల గోపి, దంగేటి శ్రీను, అంజూరి వంశీ, కుడుపూడి రామకృష్ణార్జున, కుప్పాల శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మూతపడ్డ బ్రాందీ షాపులు

అయినా అందుబాటులో మద్యం

ఉప్పలగుప్తం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ సందర్భంగా మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఈ నెల 5వ తేదీ నాలుగు గంటల వరకు మద్యం షాపులు మూసి వేయాలని ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఉప్పలగుప్తం మండలంలో పోలింగ్ కేంద్రం సమీపంలోని రెండు మద్యం దుకాణాలు సాయంత్రం అయిదు గంటలు కావస్తున్నా మూసివేయక పోవడంతో పోలీసులు దగ్గరుండి మూసి వేయించారు. కాగా షాపులు మూసివేసినా మద్యం ప్రియులకు మాత్రం అన్ని చోట్లా మందు అందుబాటులో లభించడం గమనార్హం. మందు విక్రయాలకు అవరోధం లేకుండా పాటదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

జోరుగా మద్యం అమ్మకాలు

అల్లవరం,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5వతేదీ వరకు మద్యం షాపులు బంద్ చేయాలని ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ యథావిధిగా మద్యం అమ్మకాలు సాగాయి. అల్లవరం, కొమరగిరిపట్నం, బెండమూర్లంక, బోడసకుర్రు తదితర షాపుల్లో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ మంగళవారం రాత్రి కూడా మద్యం షాపుల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. దేవగుప్తం, అల్లవరం, ఓడలరేవు, కొమరగిరిపట్నం, మొగళ్లమూరు గ్రామాల్లో బెల్ట్‌షాపుల వద్ద అమ్మకాలు ఊపందుకున్నాయి. మండల పరిధిలో గతంలో 160కుపైగా అనధికార బెల్ట్‌షాపులు ఉండగా ఆసంఖ్య220 దాటింది. ఎన్నికలనియమావళిని ఉల్లంఘిస్తూ మద్యం అమ్మకాలు జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ దాడులు చేయడం లేదని విమర్శిస్తున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కాట్రేనికోన, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో మంగళవారం ఎయిడ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ కుమార్, పాలకవర్గ సభ్యుడు సందీప్, విద్యాశాఖాధికారిణి ఎస్.జయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కేవీవీ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



బండారులంక జడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అమలాపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బండారులంక శ్రీపేరి రామేశ్వరశర్మ అండ్ బాసిన గంరాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు 27ఏళ్ల అనంతరం పాఠశాల ప్రాంగణంలో మంగళవారం కలుసుకున్నారు. వృత్తి, ఉద్యోగాల పరంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న స్నేహితులంతా తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. రానున్న వేసవి కాలంలో కుటుంబ సమేతంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు జాన గణేష్, ఆకెళ్ల రామకృష్ణ, కాండ్రేగుల శివరాజు, యండమూరి అచ్యుత్, పిచ్చిక సత్యం, మామిడిశెట్టి విష్ణుప్రసాద్, విత్తనాల సురేష్, దంగేటి ప్రసాద్, మట్టపర్తి నాగేంద్ర, గిడ్ల శ్రీను, బళ్ల నాగమణి, లక్కింశెట్టి దుర్గ, బళ్ల కామేశ్వరి, భోజనపల్లి వాసవి, దంగేటి నిర్మల, నాళం సీతారత్నం పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు రగ్గులు, బెడ్స్ పంపిణీ

రాజోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజోలులో బీసీ బాలుర హాస్టల్‌లో ఉన్న 38మంది విద్యార్థులకు మలికిపురానికి చెందిన ఎల్ఎస్ ల్యాండ్ మార్క్ అధినేత లింగోలు పెద్దబ్బులు, జనసేన టీమ్ సభ్యులు రూ.లక్ష విలువైన బెడ్‌లు, దుప్పట్లు, దిండులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతులమీదుగా మంగళవారం అందజేశారు. అలాగే రాజోలు సమీకృత బాలికల హాస్టల్ విద్యార్థినులు 140మందికి శ్రీముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సమకూర్చిన రగ్గులను ఎమ్మెల్యే దేవ అందజేశారు. ఈసందర్భంగా హాస్టల్ విద్యార్థులకు బెడ్‌లు, రగ్గులు, దిండులను పంపిణీ చేసిన దాతలు, ట్రస్టు వ్యవస్థాపకుడు ముదునూరి లతేంద్రవర్మను ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాజోలు మండల జనసేన అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, కాట్న రాజు, కుంపట్ల చిన్నారి, హాస్టల్ వార్డెన్ జ్యోతిపాల్గొన్నారు.

రాకెట్ సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన

ముమ్మిడివరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్, ఖగోళ ప్రయోగాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ సూచించారు. గాడిలంక జడ్పీ ఉన్నత పాఠశాల, ముమ్మిడివరంలోని రవీంద్ర హైస్కూలులో మంగళవారం విద్యార్థులకు రాకెట్ సైన్స్‌పై సెమినార్ నిర్వహించారు. ఇస్రో, రాకెట్ సైన్స్ గురించి బోధనా పరికరాలు ఉపయోగించి వారికి అవగాహన కల్పించారు. ఖగోళశాస్త్రం, ఇస్రో కార్యకలాపాలు, రాకెట్‌సైన్స్‌పై విద్యార్థులను ప్రశ్నించి జవాబులు రాబట్టి విద్యార్థుల సందేహాలను నివృత్తిచేసి వారిలో చైతన్యం తీసుకువచ్చారు. గాడిలంక హెచ్ఎం గొర్రెల ఉదయభాస్కరరావు,రవీంద్ర హైస్కూలులో డాక్టర్ జగతా వెంకటలక్ష్మి-నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో కరస్పాండెంట్ పొత్తూరి లక్ష్మీశ్రీనివాస్, హెచ్ఎం పొత్తూరి వీరవెంకటసత్యనారాయణమూర్తిరాజు, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, గాడిలంక హైస్కూలులో జేవీఎల్ నరసింహారావు, సుజాత,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుసు దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

మామిడికుదురు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొలుసు దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. గత నెల 20న వృద్ధురాలి మెడలో ఇద్దరు వ్యక్తులు బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారని, దీనిపై కేసు నమోదుచేసి సీసీ పుటేజీల ఆధారంగా మంగళవారం అప్పనపల్లి నుంచి పాశర్లపూడి వైపు వస్తున్న అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతడు నేరం ఒప్పుకున్నట్టు తెలిపారు. ఫిర్యాది శేషకుమారి దగ్గర బంధువైన కల్వకొలను హేమంత్‌కుమార్ 15ఏళ్ల క్రితం మామిడికుదురు వదిలిపెట్టి తాడిగడప వెళ్లి అక్కడ జీవిస్తున్నాడని తెలిపారు. అప్పుడప్పుడు స్వగ్రామం మామిడికుదురు వచ్చి బాధితురాలిని చూసి ఆమె మెడలోని బంగారు వస్తువులపై ఆశపడ్డాడు. గతనెల 20న స్నేహితుడి సహకారంతో అతడు వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును దొంగిలించుకుపోయారు. రెండో వ్యక్తి పరారీలో ఉన్నాడని, బంగారం గొలుసు రికవరీచేసి పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలింపు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని రాజోలు కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు.

బెల్టుషాపుపై దాడి

50 ఎన్డీపీ మద్యం సీసాలు స్వాధీనం

ముమ్మిడివరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం పెనుమల్లలో బెల్టుషాపుపై ఎక్సైజ్ అధికారులు దాడిచేసి బీర పల్లేశ్వరరావును అరెస్టు చేసినట్టు ముమ్మిడివరం ఎక్సైజ్ సీఐ ఎల్.చిరంజీవి మంగళవారం తెలిపారు. 50మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఒక స్కూటీని సీజ్ చేశామన్నారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు.

అగ్నిప్రమాదంలో పశువులశాల దగ్ధం

ఐ.పోలవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మురమళ్లలో సోమవారం రాత్రి జంపన బాబుకు చెందిన పశువుల శాల అగ్నికి ఆహుతైంది. స్థానికులు పశువులశాలలోని ఆవులు, గేదెలను బయటకు తరలించి రక్షించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించినట్టు భావిస్తున్నారు. స్థానికులు తొలుత మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం ముమ్మిడివరం అగ్నిమాపకదళం ఆధ్వర్యంలో మంటలను అదుపుచేశారు.

విత్తనాల సరఫరా

మలికిపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో దాళ్వా సాగు చేస్తున్న రైతులకు 150 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేసినట్టు మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.రాకేష్ మంగళవారం తెలిపారు. సార్వాలేని ప్రాంతాల్లో నారుమడులు ముందువేసి దాళ్వాకు వెళ్లాలని ఆయన రైతులను కోరారు.

మహిళలకు ఉచిత గ్యాస్ అందజేయాలి

మలికిపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత గ్యాస్ అందజేయాలని పీసీసీ సభ్యులు రుద్రరాజు గోపాలకృష్ణరాజు అన్నారు. మహిళలు ముందుగా సొమ్ము చెల్లించిన తర్వాత గ్యాస్ సొమ్మును బ్యాంక్ అకౌంట్‌లో వేసే విధానం సరికాదన్నారు. బ్యాంకుల చుట్టూ సొమ్ముల కోసం మహిళలు తిరగాల్సి వస్తుందని, అలా కాకుండా గ్యాస్ కంపెనీలతో మాట్లాడి సొమ్ములు కట్టించుకోకుండా ఉచితంగా గ్యాస్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా లంకాలమ్మ తల్లి పంటజాతర

అంబాజీపేట,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ముక్కామల గ్రామదేవత శ్రీలంకాలమ్మ తల్లి పంటజాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. గ్రామంలో పండిన పంట అమ్మవార్కి నైవేద్యంగా సమర్పించి పంటజాతర నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అమ్మవార్ని పలువురు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

ముమ్మిడివరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులంతా ఆత్మస్థైర్యంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేయాలని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని భవిత సెంటర్‌లో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీఏటా డిసెంబర 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, భవిత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మామిడికుదురు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘ మండల శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్‌బాబు తెలిపారు. మామిడికుదురులోని బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఉదయం 9గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని, రక్తదానం చేసే దాతలు, అంబేడ్కర్ అభిమానులు హాజరై రక్తదానం చేయాలని కోరారు. వివరాలకు సెల్ 9494000669, 9603198536 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నాస్ పరీక్ష నిర్వహణపై అవగాహన

మామిడికుదురు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నాస్ పరీక్ష నిర్వహణపై అవగాహన కార్యక్రమం మంగళవారం మామిడికుదురు విద్యావనరుల కేంద్రంలో జరిగింది. నాస్ పరీక్షకు ఎంపికైన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు పాల్గొని పరీక్ష నిర్వహణకు సంబంధించి ఫీల్డు ఇన్వెస్టిగేటర్లు, ప్రధానోపాధ్యాయులకు విధివిధానాలు వివరించారు. పరీక్ష ఎలా నిర్వహించాలి, తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వెబెక్స్ సమావేశం ద్వారా సమాచారాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఫీల్డు ఇన్వెస్టిగేటర్లు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు కల్వర్టు ఏర్పాటు చేస్తాం

అంబాజీపేట, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మాచవరం వినాయకుడి ఆలయం వద్ద ప్రధాన రహదారిలో నిబంధనల మేరకు తూరలు తొలగించి కల్వర్టు ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ డీఈ జి.రాజేంద్ర తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తూరలు ఏర్పాటు చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. ఈవిషయం పత్రికల్లో రావడంతో ఆర్‌అండ్‌బీ మంగళవారం రహదారిని పరిశీలించారు. నిబంధనల మేరకు మురుగునీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వీరేశ్వరుని సన్నిధిలో ఎన్నికల అబ్జర్వర్

ఐ.పోలవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలనాధికారి కె.హర్షవర్ధన్ మంగళవారం మురమళ్ల శ్రీ భద్రకాళీసమేతవీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షణాధికారి కటారి శ్రీనివాసరాజు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అర్చకుడు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించారు. వీరేశ్వరుని చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్డీవో కె.మాధవి, డీటీ మహాలక్ష్మీనాయుడు పాల్గొన్నారు.

యానాంలో ఘనంగా యువ ఉత్సవ్

యానాం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం యానాం ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో యువఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రారంభించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడారు. ఈసందర్భంగా సైన్సు ఎగ్జిబిషన్, కల్చరల్‌గ్రూప్‌డ్యాన్స్, మొబైల్ ఫొటోగ్రఫీ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జి పరిపాలనాధికారి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి గోపి పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వెంకన్న ఆలయంలో భక్తజనం

ఆత్రేయపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విశాఖజిల్లా గోపాలపట్నంకు చెందిన మారిశెట్టి వరలక్ష్మి రూ.51వేలు విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,72,233 లభించినట్టు ఉప కమిషనర్, ఈవో నల్లం చక్రధరరావు తెలిపారు.

రామచంద్రపురం తహసీల్దార్‌గా సావిత్రి



ద్రాక్షారామ,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం తహసీల్దార్‌గా ఎం.సావిత్రి బాధ్యతలు స్వీకరించారు. రంపచోడవరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న సావిత్రి బదిలీపై రామచంద్రపురం తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

మూతపడిన రైతుబజారు

రూ.35 లక్షలు నిరుపయోగం

రెండేళ్లుగా తెరుచుకోని రైతు బజారు

రాయవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించిన ఉత్పత్తులను దళారుల ప్రమేయం లేకుండా నాణ్యమైన ఉత్పత్తులు నేరుగా ప్రజలకు విక్రయాలు చేసేందుకు నిర్మించిన రైతుబజారు నిరుపయోగంగా మారింది. రాయవరం-మహేంద్రవాడ రోడ్డులో పంచాయతీ స్థలంలో రెండు సంవత్సరాలక్రితం రైతుబజారు నిర్మించారు. వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ దృష్టి పెట్టకపోవడంతో రూ.35లక్షలతో నిర్మించిన రైతు బజారు ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతోపాటు పలువురు ప్రైవేటు వ్యక్తులు రైతుబజారు స్థలాన్ని అవసరాలకు వాడుకుంటున్నారు.

ప్రారంభించిన మరునాడే మూత

సుమారు రూ.35లక్షల వ్యయంతో రైతు బజారు నిర్మించారు. 2022 నవంబరు 16వ తేదీన రైతుబజారును వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మం



దుమ్ముతో ఉన్న దుకాణాలు

(ప్ర)తి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. రైతు బజారు ప్రారంభం రోజున కొద్దిపాటి స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు మెప్పుకోసం అధికారులు కూరగాయల వ్యాపారులను తీసుకువచ్చి ఏర్పాటు చేశారు. ప్రారంభించిన మరునాడే రైతు బజారు మూతపడగా రైతు బజారు రెండు సంవత్సరాలు కావస్తున్న నేటికీ తెరుచుకోలేదు.



రాయవరంలో నిరుపయోగంగా ఉన్న రైతుబజారు

వినియోగంలోకి రాని రైతుబజారు

వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారులు రైతుబజారు నిర్మించారు కానీ రైతుబజారు వద్దకు రైతులను తీసుకువచ్చి వారు పండించిన ఉత్పత్తులను విక్రయించే దిశగా చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో రైతు బజారు ప్రాంగణం పిచ్చి మొక్కలు మొలిచి అధ్వానంగా తయారైంది. రైతు బజారు గేటుకు కనీసం తాళం వేయకపోవడంతోపాటు లోపల స్టాల్స్ దుమ్ము, ధూళి చేరి అధ్వానంగా తయారైంది.

సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు

రైతు బజారు నిరుపయోగంగా మారడంతో రాయవరంలో పలు కూరగాయల వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటుండగా వినియోగదారులకు ధరల మంట తప్పడంలేదు. రైతు బజారు లేకపోవడంతో వారపు సంతలు, ప్రైవేటు వ్యాపారులవద్ద ప్రజలు కూరగాయలు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో నిరుపయోగంగా ఉన్న రైతు బజారును ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతు బజారును వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి

• ఏజీపీ విద్యాప్రసన్న • ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

ఆలమూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో అన్నిరంగాలలోను రాణించాలని ఆలమూరు జూనియర్ సివిల్‌కోర్టు ఏజీపీ బూసి విద్యాప్రసన్న అన్నారు. ఆలమూరు భవిత సెంటర్లో ఆమె దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్నారు. దివ్యాంగులలో ప్రతిభాపాటవాలకు, సృజనాత్మక శక్తులకు ఎలాంటి కొదవ ఉండదని వారిని సరైన శిక్షణ ఇస్తే అన్నిరంగాలలోను రాణిస్తారని విద్యాప్రసన్న అన్నారు. ఈసందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు పండ్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.నరసింహస్వామికి అధ్యాపకులు, గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు సత్కరించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



భవితసెంటర్లో విద్యార్థులతో ఆలమూరు ఏజీపీ విద్యాప్రసన్న



కొత్తపేట: మాట్లాడుతున్న ఎంఈవో ఎం.హరిప్రసాద్



రావులపాలెం: ఊబలంక మదర్‌థెరిస్సా ఆశ్రమంలో...



రాయవరం: వాటర్ ప్యూరిఫైయర్ అందజేస్తున్న దృశ్యం

దివ్యాంగుల అభివృద్ధికి తోడ్పడాలి

కొత్తపేట: ప్రత్యేక అవసరాల పిల్లలను వారి తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకునివారి మానసిక, శారీరక అభివృద్ధికి తోడ్పడాలని మండల విద్యాశాఖాధికారి ఎం.హరిప్రసాద్ సూచించారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గౌతమినగర్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో హెచ్‌ఎం ఏ.సుభాష్‌చంద్రశేఖర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల విద్యాశాఖాధికారులు హరిప్రసాద్, కె.లీలావతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల విద్యార్థులను ప్రతిరోజు క్రమం తప్పకుండా వారి తల్లిదండ్రులు భవిత సెంటర్‌కు తీసుకువచ్చి వారు అందించే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు శ్రద్ధవహిస్తే దివ్యాంగులు కూడా సమాజంలోని అందరితో సమానంగా పోటీ పడతారన్నారు. మేనరిక వివాహాలు తగ్గించడం ద్వారా దివ్యాంగుల సంఖ్య పెరగకుండా చేయవచ్చునని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు ఎస్.సత్యనారాయణ, కె.లక్ష్మికుమారి, సీఆర్పీలు, ఐఈఆర్టీలు కె.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని సోమేశ్వరం భవితా కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ వైకల్యం అనేది శరీరానికి మాత్రమేనని సంకల్పానికి కాదన్నారు. దివ్యాంగులను, ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు తల్లిదండ్రులతో పాటు సమాజం ప్రోత్సహిస్తే వారు మరిన్ని విజయాలు సాధిస్తారన్నారు. భవితా కేంద్రంలో చిన్నారులకు పలురకాల పోటీలు నిర్వహించి విజేతలకు పండ్లు, బిస్కెట్స్ ప్యాకెట్లు, బహుమతులు అందజేశారు. వలంటరీ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి వితరణతో విద్యార్థుల కోసం వాటర్ ప్యూరిఫైయర్ అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర సాయి భవితాకేంద్రం టీచర్స్ టి.వీరవేణి, పి.ఆదర్శ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రావులపాలెం: ఊబలంక మదర్‌థెరిస్సా ఆశ్రమంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని దిడ్ల కిషోర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఆర్సీ రూపశిల్పి డాక్టర్ విక్టరీ వెంకటరెడ్డి పాల్గొని కేక్‌ను కట్ చేసి పిల్లలకు పంచారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్‌పీసీఎల్ హెచ్‌ఆర్ పి.సుభాకర్ పాల్గొని పిల్లలకు దుప్పట్లు, పుస్తకాలు, పండ్లు పంచారు. అనంతరం పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ సుబ్బరాజువర్మ, కొవ్వూరి దుర్గారెడ్డి, మల్లిడి రామిరెడ్డి, మల్లిడి చిట్టిరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ): దివ్యాంగులు మొక్కవోని ధైర్యంతో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామచంద్రపురంలో దివ్యాంగులకు సామాజిక భవనం నిర్మాణానికి కృషిచేస్తానని అన్నారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు పించను రూ.6వేలు పెంచడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీవరప్రకాష్

మండపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందని మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ అన్నారు. పట్టణంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగులు దినోత్సవంను పురస్కరించుకుని జరిగిన కార్యక్రమానికి చుండ్రు శ్రీవరప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల చొరవతో దివ్యాంగులకు భవనం నిర్మించామన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచామన్నారు. అలాగే టీడీపీ కౌన్సిల్‌లో 3శాతం నిధులు దివ్యాంగుల కోసం కేటాయించిన విషయంను ఆయన గుర్తు చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్రకార్యదర్శి దూళి జయరాజు మాట్లాడుతూ మండపేటలో దివ్యాంగుల కోసం



మండపేటలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీవరప్రకాష్

40సెంట్ల భూమి కేటాయించటంతోపాటు, రూ.50 లక్షలతో భవనం నిర్మించాలని దూళి కోరారు. దివ్యాంగులకు కూడా స్కిల్ డవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చేలా ఎమ్మెల్యే వేగుళ్ల కృషి చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి వేడుకలను జరుపుకున్నారు. దివ్యాంగులకు నిర్వహించిన ఆటలపోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లను అందజేశారు. 7 ట్రై సైకిళ్లు, 5 వీల్ చైర్‌లను అందించారు. కార్యక్రమంలో కూటమినేతలు కె.సత్యన్నారాయణ, మల్లిపూడి గణేష్, గుండు తాతరాజు, కురసాల సత్య నారాయణ, అనపూరి విజయ్. కురుపూడి శ్రీను, బొజ్జా రామకృష్ణ, శనగల భవాని, దూళిప్రవీణ్, పులపల్లి రాజా, మోరంపూడి సూరిబాబు పాల్గొన్నారు.

తెలుగు ప్రతిభా పోటీలలో

షిర్డీసాయి విద్యార్థినికి ప్రథమ స్థానం



విద్యార్థిని నవ్య

ఆలమూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగురాష్ట్రాల పరిధిలో జరిగిన తెలుగు ప్రతిభ పోటీలలో మండలంలోని చెముడులంక శ్రీషిర్డిసాయి విద్యానికేతన్ విద్యార్థిని నంద్యాల నవ్యతేజశ్రీకి ప్రథమస్థానం లభించింది. మన సంస్కృతి నెట్‌వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాలలో 877 స్కూల్స్ నుంచి విద్యార్థులు ఈపోటీలలో పాల్గొన్నారు. తెలుగు ప్రతిభ పోటీలలో ప్రతిభచూపిన నవ్యతేజశ్రీ ప్రథమస్థానం సాధించినట్లు విద్యానికేతన్ డైరెక్టర్ ఉమారాణి తెలిపారు. ఈనెల 13న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో విద్యార్థిని నవ్యకు నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థిని నవ్యతేజశ్రీని ఆమె తల్లిదండ్రులు ఎస్.వెంకట్రావు, నాగలక్ష్మిలను విద్యానికేతన్ డైరెక్టర్ ఉమారాణి అభినందించారు.

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ

కపిలేశ్వరపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్యుతాపురం పరిధిలోని వల్లూరు గ్రామ సచివాలయంలో మంగళవారం హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. వల్లూరు పీహెచ్‌సీ ఏఎన్‌ఎం వై.స్వర్ణలత మానవతా దృక్పథంతో ఐదుగురు బాధితులకు వీటిని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి అలేఖ్య మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపట్ల వివక్షచూపకుండా వారిని ప్రోత్సహించాలన్నారు. సరైన పౌష్టికాహారం తీసుకుంటూ తగిన వ్యాయామం చేయడంద్వారా జీవనశైలిలో మార్పురావడంతోపాటు ఆయు ప్రమాణం పెంచుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం స్వర్ణలతను పలువురు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌వీ వీవీ రమణ, ఆరోగ్య సహాయకులు రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

6 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

కపిలేశ్వరపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగరలో ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాలు ఈనెల 6 నుంచి 11వరకూ ఆరురోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాంబాబురెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ వారు తెలిపారు. కొమాళ్ళపల్లి సత్యనారాయణమూర్తి కుమారులు సుబ్రహ్మణ్యం, వెంకట్రావుల అర్చక పర్యవేక్షణలో శ్రీ కంరం మల్లేశ్వరపుశర్మ బ్రహ్మత్వంలో ఈ కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. 6న సంకల్పం, గ్రామోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణోత్సవం, 7న తీర్థం, 8న పెనికేరుకు చెందిన శ్రీలక్ష్మీగణపతి సమాజం మహిళలచే భజన కీర్తనలు, సదస్యం, 9న కోలాట భజన మండలిచే కోలాటం ప్రదర్శన, 10న స్వామివారి కంకణసేవా ఉత్సవం, హనుమాన్ ఛాలీసా, గీతాపారాయణం, 11న స్వామివారి శ్రీ పుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగియనున్నట్లు వారు తెలిపారు.



అంగరలో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

పోలింగ్ కేంద్రం పరిశీలన

అయినవిల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ జరిగే అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్ మంగళవారం పరిశీలించారు. జిల్లాలో 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నిక పూర్తి అయిన తరువాత బాక్సులను కాకినాడ తరలించి భద్రపరుస్తామన్నారు. ఆయన వెంట కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, తహశీల్దార్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీవో భీమారావు ఉన్నారు.

దివ్యాంగుల్లో మనోధైర్యాన్ని పెంపొందించేందుకు కృషి : ఆర్డీవో

అమలాపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో మనో ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. వైకల్యంతో ఉన్నవారిపై చిన్నచూపు చూడకుండా ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్న సూచనలతో ప్రతీ ఏటా డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈదరపల్లిలోని హరి మనోవికాస కేంద్రం(మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల)లో మంగళవారం దివ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల సమక్షంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో కేక్ కట్‌చేసి వారికి తినిపించారు. హరి మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రాజశేఖర్ చేస్తున్న సేవలను ఆమె అభినందించారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

● రూ.12కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు

ఆత్రేయపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పల్లెల్లో రహదారులు నిర్మిస్తున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషి నేపథ్యంలో రూ.12కోట్లతో రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయి. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఎస్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా ఈ పనులు చేపడుతున్నారు. ఆత్రేయపురం మండలంలో 30 పనులకు రూ.3.60కోట్లు, ఆలమూరు మండలంలోని 17 పనులకుగాను రూ.2.45కోట్లు, కొత్తపేట మండలంలో 16 పనులకు రూ.2.90 కోట్లు, రావులపాలెం మండలంలో 24 పనులకు రూ.2.68 కోట్లు నిధులు మంజూరయ్యాయి. గ్రామాల్లో సీసీ రోడ్లు డ్రైనేజీలు, ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్మిస్తున్నారు. గత ఐదేళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోని పల్లెలు కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చెందుతున్నాయి.



పేరవరంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

ఆర్టీసీ ఏసీ బస్సుల్లో

ప్రయాణికులకు 10 శాతం రాయితీ

● డిపో మేనేజర్ మూర్తి

అమలాపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, విశాఖపట్నం ప్రాంతాలకు నడుపుతున్న ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు టిక్కెట్ ధరలో 10శాతం రాయితీ కల్పిస్తున్నట్టు అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్‌ఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. అమరావతి, నైట్‌రైటర్, ఇంద్ర బస్సు సర్వీసుల్లో ప్రయాణికులకు ఈ రాయితీ డిసెంబరు 31వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సీహెచ్‌ఎస్‌ఎన్ మూర్తి



టీటీడీ బోర్డు సభ్యుడు అక్కినను రాజమహేంద్రవరంలో కలిసిన మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్

టీటీడీ బోర్డు సభ్యుడిని కలిసిన టీడీపీ నేతలు

మండపేట, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమితులైన అక్కిన మునికోటేశ్వరరావును మంగళవారం రాజమహేంద్రవరంలో మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మాజీ ఎమ్మెల్యే వల్లూరి రామకృష్ణ తనయుడు వల్లూరి శ్రీనివాస్, మాజీ సహకార సంఘం అధ్యక్షుడు మల్లిపూడి గణేష్, ఎంపీఎస్ విద్యాసంస్థల అధినేత వల్లూరి చిన్నారావులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

సహకార సంఘాల ద్వారా

రైతులకు టార్పాలిన్లు సరఫరా

● జాయింట్ కలెక్టర్ నిషాంతి

అయినవిల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 65 సహకార సంఘాలకు రూ.14.40లక్షల విలువైన 800 టార్పాలిన్లు అందించినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. వీటిని సహకార సంఘాల ద్వారా అవసరమైన రైతులకు అందజేస్తున్నట్టు వివరించారు. మంగళవారం మండలంలోని సిరిపల్లి రైతు సేవా కేంద్రంలో నలుగురు రైతులకు ఆమె టార్పాలిన్లు అందించారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వర్షాలకారణంగా కోల్పోకుండా కాపాడుకోవడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు టార్పాలిన్లు అందిస్తున్నట్టు వివరించారు. అవసరమైన రైతులు వీటిని ఉపయోగించుకుని అనంతరం సహకార సంఘాలకు ఇచ్చేలా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 151 పీఏసీఎస్‌ల పరిధిలో 221 క్లస్టర్లలో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ముమ్మిడివరం, అమలాపురం కోఆపరేటివ్ సబ్‌డివిజన్‌లో 300 టార్పాలిన్లు, రాజోలు సబ్‌డివిజన్‌లో 100, కొత్తపేట సబ్‌డివిజన్‌లో 188, ఆలమూరు సబ్‌డివిజన్‌లో 119, రామచంద్రపురం సబ్‌డివిజన్‌లో 93 టార్పాలిన్లను పీఏసీఎస్‌కు అందించామన్నారు. కోనసీమ జిల్లాలోని రైతులకు వీటిని అందించామని జేసీ నిశాంతి తెలిపారు. జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సిరిపల్లి రైతు సేవా కేంద్రం వద్ద టార్పాలిన్లు అందజేస్తున్న జేసీ నిషాంతి

ప్రాధాన్యం సంతరించుకున్న

కంప్యూటర్ యుగం



రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ లిటరసీ డే సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

రావులపాలెం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): నేటి టెక్నాలజీ యుగంలో కంప్యూటర్ ప్రాధాన్యంను సంతరించుకుందని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్సు అధ్యాపకురాలు యు.సుభాషిణి ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌బాబు అధ్యక్షతన కంప్యూటర్ లిటరసీ డే నిర్వహించారు. కార్యక్రమానికి కొత్తపేట డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్సు అధ్యాపకుడు కెవిఎస్ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో ఏ పనికావాలన్న కంప్యూటర్ లేకుండా జరగడంలేదన్నారు. ఈ కంప్యూటర్ లిటరసీ విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రత్యేక భూమిక పోషిస్తుందన్నారు. కంప్యూటర్ లిటరసీపై విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుమలత, రజనీ, ఎన్‌ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, రెడ్డి పాల్గొన్నారు.

గంగవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కె.గంగవరం, డిసెంబరు 3: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గంధం నారాయణరావును గెలిపించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అన్నారు. మంగళవారం ఆయన గంగవరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలపట్ల అవగాహన ఉండి వాటి పరిష్కారానికి కృషి చేసే నారాయణరావును గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్య దర్శి సర్వేపల్లి పల్లంరాజు, ఉమాపతి శాస్త్రి, వి.మురళీకృష్ణ, కె.శ్రీనివాసరావు, శ్యామలాదేవి, గంగవరం పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గంగవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న దొరబాబు